మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...

## నేటి మాట

ఒక్క క్షణం సహనం కొండంత ప్రమాదాన్ని దూరం చేస్తే... ఒక్క క్షణం అసహనం మొత్తం జీవితాన్నే నాశనం చేస్తుంది



-స్వామి వివేకానంద

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 02 సంచిక 109 | సోమవారం 06 ఏప్రిల్ 2026 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 | వెల: 3 రూ/-

## తెలంగాణ హైకోర్టు జోన్-2 భవన నిర్మాణానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన

**న్యూస్ డెస్క్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్):** తెలంగాణ న్యాయ వ్యవస్థ చరిత్రలో ఆదివారం మరో కీలక అడుగు పడింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పరిధిలోని బుద్వేల్‌లో అత్యున్నత ప్రమాణాలతో నిర్మించనున్న హైకోర్టు జోన్-2 భవన నిర్మాణ పనులకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు, హైకోర్టుకు చెందిన పలువురు ప్రముఖ న్యాయమూర్తులు పాల్గొన్నారు.

సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటున్న ఈ నూతన ప్రాంగణంలో అత్యాధునిక వసతులతో కూడిన కోర్టు గదులు, డిజిటల్ లైబ్రరీలు, పరిపాలనా విభాగాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా రెండో దశలో న్యాయమూర్తుల క్వార్టర్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నారు. ప్రస్తుతం ఉన్న హైకోర్టు భవనం వారసత్వ కట్టడంగా ఉన్నందున, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా బుద్వేల్‌లో ఈ కొత్త కాంప్లెక్స్‌ను ప్రభుత్వం నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మితమవుతున్న ఈ జోన్-2 భవనం ద్వారా న్యాయ సేవల వేగం మరింత పెరుగుతుందని అధికారులు వెల్లడించారు.


2 లో

## లోయలో పడ్డ పర్యాటకుల వాహనం.. నలుగురు మృతి


2 లో

**న్యూస్ డెస్క్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్):** పర్యాటకులతో వెళ్తున్న వాహనం అర్ధరాత్రి అదుపుతప్పి లోయలో పడిపోవడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ షాకింగ్ ఘటన హిమాచల్ ప్రదేశ్‌లోని కులు జిల్లాలో శనివారం రాత్రి దాటిన తర్వాత చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. ఈ ప్రమాదంలో మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు.

## కూతురు విడాకులు..

### పేరెంట్స్ గ్రాండ్ సెలబ్రేషన్స్

- మీరట్‌లో వైరల్ అయిన వీడియో
- 2018లో జరిగిన వివాహం
- అత్తింట్లో వేధింపుల ఆరోపణలు
- కూతురికి ఘన స్వాగతం


2 లో

## పార్టీ మారడం బట్టలు మార్చుకున్నంత సులభం కాదు

- "పిచ్చి ప్రచారాలు" అంటూ ఖండన
- బీజేపీని వీడటం లేదని స్పష్టం
- పదవుల కోసం తాను కాదన్న ఈటల
- కేసీఆర్‌పై పాత విషయాల ప్రస్తావన
- కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు
- జీహెచ్ఎంసీ ఎన్నికలపై కీలక చర్చలు


2 లో

## కుప్పకూలిన 4 అంతస్తుల భవనం

### ఇద్దరు మృతి, శిథిలాల కింద మరికొందరు!


2 లో

**న్యూస్ డెస్క్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్):** భారీ భవనం కుప్పకూలి ఇద్దరు ప్రాణాలు కోల్పోగా మరికొంత మంది శిథిలాల కింద చిక్కుకున్నారు. ఈ షాకింగ్ ఘటన శనివారం రాత్రి మధ్యప్రదేశ్‌లోని అనుప్పూర్ జిల్లా కోత్మా పట్టణంలో చోటు చేసుకుంది.

## పాలమూరులో హైటెక్ వ్యభిచారం

**న్యూస్ డెస్క్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్):** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో భారీ వ్యభిచార సామ్రాజ్యం విస్తరించింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని నడిబొడ్డున అశోక్ టాకీస్ ప్రాంతంలో పోలీసుల దాడులతో ఏడుగురు విటులతో పాటు ఇద్దరు మహిళలు దొరకడం విస్మయానికి గురిచేస్తుంది. పోలీసులు నిత్యం గస్తీ నిర్వహించే అశోక్ టాకీస్ వంటి రద్దీ ప్రాంతాలు, నివాస గృహాలు అధికంగా ఉండే మర్లు, బైపాస్ రోడ్డు ప్రాంతాలను కూడా తమ అడ్డాలుగా మార్చుకున్న సదరు వ్యక్తులు వేలాది మంది విటులతో ఒక వ్యవస్థీకృత నేర సామ్రాజ్యాన్ని నిర్మించినట్లు సమాచారం.


2 లో

**మూడంచెల భద్రత.. కోడింగ్ భాష!**

నిర్వాహకుడు తన చుట్టూ 20 మంది అనుచరులతో ఒక ప్రత్యేక భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసుకున్నాడని, ఎవరికీ అనుమానం రాకుండా ఎప్పటికప్పుడు అద్దె ఇళ్లను మారుస్తూ (సుమారు 40 ఇళ్లు) దందాను గుట్టుగా నడిపిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా మహిళల ఫొటోలను విటులకు పంపిస్తూ, కోడింగ్ భాషలో వ్యవహారాలు నడిపిస్తున్నా పోలీసులకు చిక్కకపోవడం గమనార్హం. మహబూబ్ నగర్ జిల్లా పరిధిలో సుమారుగా రెండువేల మందికి పైగా కాంటాక్ట్స్ తో ఈ దందాను గుట్టుగా సాగిస్తున్నారు. గత వారం రోజుల క్రితం పోలీస్ దాడులతో పట్టుబడిన సదరు వ్యక్తి స్టేషన్ బెయిల్ తీసుకుని మళ్లీ దందా షురూ చేసినట్లు సమాచారం.

## చౌడేశ్వరి పరువుహత్య కేసు : సీఐపై సస్పెన్షన్ వేటు

- విచారణలో బయటపడ్డ నిజాలు
- తల్లిదండ్రులతో కలిసి కుట్ర ఆరోపణలు
- డబ్బు తీసుకున్నట్లు ఆరోపణలు
- ఆత్మహత్యగా మలిచే యత్నం విఫలం
- పోస్టుమార్టం రిపోర్టుతో నిజం బట్టబయలు


2 లో

## ఇన్ స్టాగ్రామ్ లవ్..

### మచిలీపట్నంలో యువతి ఆత్మహత్య

- కట్నం డిమాండ్‌తో విభేదాలు
- ప్రేమ పేరుతో మోసం ఆరోపణ
- ఎలుకల మందు తాగిన యువతి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- నిందితుడిపై చర్యలకు డిమాండ్


2 లో

# అజారుద్దీన్‌కు టైమ్ లిమిట్ టెన్షన్

## ఏప్రిల్ 30 డెడ్‌లైన్ కీలకం

- ఎమ్మెల్సీ అవ్వాలి.. లేదంటే పదవి గుడ్‌బై
- ఎమ్మెల్యే ఛాన్స్ దాదాపు లేదు
- నిజామాబాద్ సీటు క్లియర్ కాదు
- గవర్నర్ కోటా మాత్రమే ఆశ
- కోర్టు కేసులతో క్లిష్ట పరిస్థితి
- కేబినెట్ నిర్ణయం కీలకం
- గవర్నర్ గ్రీన్ సిగ్నల్ కోసం వెయిట్
- మంత్రిపదవిపై సస్పెన్స్ కొనసాగుతుంది



**న్యూస్ డెస్క్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్):** మంత్రి అజారుద్దీన్ పదవికి చిక్కులు వచ్చేలా కనిపిస్తున్నాయి. ఆయన మంత్రిగా కొనసాగాలంటే ఈ నెల 30లోగా ఎమ్మెల్సీగా నియమితులు కావాల్సిన అనివార్య పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. గతేడాది అక్టోబర్ 31న ఆయన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నిబంధనల ప్రకారం చట్టసభల్లో సభ్యుడు కాకుండా మంత్రి పదవి చేపడితే కచ్చితంగా ఆరు నెలల్లో ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఎన్నిక కావాల్సి ఉంటుంది. అజారుద్దీన్ కు ఈ నెల 30తో ఆ గడువు ముగుస్తుండడంతో.. ఆయన ఎమ్మెల్సీ కాకపోతే మంత్రి పదవి కోల్పోక తప్పదని శాసనసభా నిపుణులు చెబుతున్నారు. దీంతో అజారుద్దీన్ మంత్రి పదవి వ్యవహారం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.


**అనేక చిక్కుముడులు**

ప్రస్తుతం అజారుద్దీన్ ఎమ్మెల్యే అయ్యే అవకాశం ఎలాగూ లేదు. ఇక ఎమ్మెల్సీ ఆప్షన్ చూస్తే కల్వకుంట్ల కవిత రాజీనామాతో నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం ఖాళీగా ఉంది. కానీ జెడ్పీ ఎన్నికలు ఇంకా జరగనందున.. అక్కడ ఓటర్లు లేరు. జెడ్పీ ఎన్నికల తర్వాతే నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సీటు భర్తీ కానున్నది. మరోవైపు గవర్నర్ కోటాలోని ముగ్గురు ఎమ్మెల్సీల పదవీ కాలం నవంబరులో ముగియనున్నది. ఆ మూడు ఖాళీల్లో ఒక స్థానానికి అజారుద్దీన్ పేరును మంత్రివర్గం సిఫార్సు చేయాల్సి ఉంటుంది. అయితే ఈనెల 30లోగా ఎమ్మెల్సీగా ఎన్నిక కాకుంటే ఆయన మంత్రిపదవికి రాజీనామా చేయక తప్పదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అయితే రాజీనామా చేసిన తర్వాత మళ్లీ మే 1 నుంచి మంత్రి పదవిని చేపట్టినా కూడా.. మళ్లీ ఆరునెలల్లోగా.. అంటే అక్టోబర్ లోగా ఎమ్మెల్సీగా నియమితులు కావాల్సి ఉంటుంది.

**గవర్నర్ నిర్ణయమే కీలకం**

ప్రస్తుతం రాష్ట్రంలో రెండు ఎమ్మెల్సీ పదవులు గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్నాయి. వీటిపై గత బీఆర్ఎస్ నుంచి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాం వరకు వివాదాలు కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమిర్ అలీ ఖాన్ పేర్లను రాష్ట్ర మంత్రివర్గం సిఫార్సు చేసింది. దీన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ హయాంలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా సిఫార్సు చేయబడ్డ వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో కోదండరాం, అమిర్ అలీ ఎమ్మెల్సీ పదవులను సుప్రీంకోర్టు కొట్టేసింది.

## అల్లూరి జిల్లాలో భూప్రకంపనలు


2 లో

**న్యూస్ డెస్క్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్):** ఏపీలోని మన్యం ప్రాంతంలో శనివారం రాత్రి భూ ప్రకంపనలు కలకలం రేపాయి. శనివారం రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలు ప్రాంతాల్లో 30 సెకండ్లపాటు స్వల్ప భూప్రకంపనలు సంభవించాయి.

## రెస్టారెంట్‌లోకి దూసుకెళ్లిన విమానం.. నలుగురు దుర్మరణం


2 లో

**న్యూస్ డెస్క్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్):** బ్రెజిల్ లో ఓ రెస్టారెంట్ లోకి విమానం దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. దక్షిణ బ్రెజిల్‌లో శుక్రవారం ఈ ఘటన జరిగింది. ఒక చిన్న విమానం ఆరుగురితో కాపావో డా కానావో విమానాశ్రయం నుంచి బయలుదేరింది.

## తారామతి రిసార్ట్ పార్టీ.. ఆరుగురికి గంజాయి పాజిటివ్?



న్యూస్ డెస్క్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): నగరంలోని గోల్కొండ తారామతి రిసార్టులో మోర్ దేన్ ఫ్రెండ్స్ పేరుతో నిర్వహించిన ఈవెంట్ పై.. ఈగల్ టీమ్ రైడ్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఈవెంట్ కు 200-300 మంది హాజరవ్వగా.. వారిలో పలువురు బాలీవుడ్ కు చెందినవారు కూడా ఉన్నారు. పార్టీలో మద్యం ఏరులై పారగా.. అనుమానంతో 36 మందికి డ్రగ్స్ టెస్ట్ చేశారు. వీరిలో 6 మందికి డ్రగ్స్ పాజిటివ్ రాగా.. వారిలో ఒక మహిళ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పాజిటివ్ వచ్చిన వ్యక్తుల్లో భార్యభర్తలు, ఒక మేల్ మోడల్, ఇతరులు బిజినెస్ చేస్తున్నట్లు గుర్తించారు. వీరిని మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచిన తర్వాత రిహాబిలిటేషన్ సెంటర్ కు పంపుతారని తెలుస్తోంది. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈగల్ టీమ్ కృషి చేస్తుండగా.. మరోవైపు ఇలాంటి పార్టీల్లో డ్రగ్స్, గంజాయి వాడకం కొత్త సవాళ్లను విసురుతోంది.

# అల్లూరి జిల్లాలో భూప్రకంపనలు

న్యూస్ డెస్క్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఏపీలోని మన్యం ప్రాంతంలో శనివారం రాత్రి భూ ప్రకంపనలు కలకలం రేపాయి. శనివారం రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలు ప్రాంతాల్లో 30 సెకండ్లపాటు స్వల్ప భూప్రకంపనలు సంభవించాయి. అరకు వ్యాలీ, పాడేరు, పెదబయలు, హుకుంపేట వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో భూమి సుమారు 30 సెకన్ల పాటు కంపించడంతో జనం తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గాఢ నిద్రలో ఉన్న గిరిజనులు ఒక్కసారిగా భూమి దద్దరిల్లడంతో ఉలిక్కిపడి లేచి, ప్రాణభయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అరకు-పాడేరు ప్రాంతం సిస్మిక్ జోన్ పరిధిలోకి వస్తుండటంతో అప్పుడప్పుడు ఇలాంటి మార్పులు సహజమేనని నిపుణులు చెబుతున్నప్పటికీ, ఈ స్థాయి అనుభవం తమకు ఎన్నడూ లేదని స్థానికులు వాపోతున్నారు.

ఈ భూప్రకంపనల ప్రభావం కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాకుండా, పొరుగున ఉన్న ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో కూడా స్వల్పంగా కనిపించినట్లు సమాచారం. కొన్ని ఇళ్లలో అల్మారాల్లో ఉన్న సామాగ్రి కింద పడిపోవడం, గోడలకు స్వల్పంగా పగుళ్లు రావడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. అయితే, తాజా నివేదికల ప్రకారం ఎక్కడా ఎటువంటి ప్రాణనష్టం లేదా ఎవరికీ గాయాలు అయినట్లు అధికారికంగా ధృవీకరించబడలేదు. దీనిని తక్కువ తీవ్రత కలిగిన మైనర్ ట్రెమర్ గా వాతావరణ, భూగర్భ పరిశోధన సంస్థలు భావిస్తున్నాయి.

# రెస్టారెంట్‌లోకి దూసుకెళ్లిన విమానం.. నలుగురు దుర్మరణం

న్యూస్ డెస్క్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): బ్రెజిల్ లో ఓ రెస్టారెంట్ లోకి విమానం దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. దక్షిణ బ్రెజిల్‌లో శుక్రవారం ఈ ఘటన జరిగింది. ఒక చిన్న విమానం ఆరుగురితో కాపావో డా కానావో విమానాశ్రయం నుంచి బయలుదేరింది. టేకాఫ్ అయిన వెంటనే విమానం రన్‌వే చివరన ఉన్న ఒక స్తంభాన్ని ఢీకొట్టింది.

ఈ క్రమంలో పక్కనే ఉన్న మరో రెస్టారెంట్‌లోకి దూసుకెళ్లి కూలిపోయింది. దాంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటనలో పైలట్ సహా ముగ్గురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలానికి సమీపంలో ఉన్న మరో ఇద్దరు గాయపడ్డారు. ప్రమాద సమయంలో రెస్టారెంట్ మూసేసి ఉంది. దాంతో భారీగా ప్రాణనష్టం తప్పిందని అధికారులు పేర్కొన్నారు. సహాయ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

ముందుజాగ్రత్తగా రెస్టారెంట్ సమీపంలోని నివాసితులను ఖాళీ చేయించారు. ఘటనపై అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకునేందుకు విచారణ చేస్తున్నారు.

# రెస్టారెంట్‌లోకి దూసుకెళ్లిన విమానం.. నలుగురు దుర్మరణం

మొదటి పేజీ తరువాయి

టేకాఫ్ అయిన వెంటనే విమానం రన్‌వే చివరన ఉన్న ఒక స్తంభాన్ని ఢీకొట్టింది.

ఈ క్రమంలో పక్కనే ఉన్న మరో రెస్టారెంట్‌లోకి దూసుకెళ్లి కూలిపోయింది. దాంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటనలో పైలట్ సహా ముగ్గురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలానికి సమీపంలో ఉన్న మరో ఇద్దరు గాయపడ్డారు. ప్రమాద సమయంలో రెస్టారెంట్ మూసేసి ఉంది. దాంతో భారీగా ప్రాణనష్టం తప్పిందని అధికారులు పేర్కొన్నారు. సహాయ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

ముందుజాగ్రత్తగా రెస్టారెంట్ సమీపంలోని నివాసితులను ఖాళీ చేయించారు. ఘటనపై అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకునేందుకు విచారణ చేస్తున్నారు.

# కేరళంలో భూభారతి అమలు చేస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్



న్యూస్ డెస్క్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): కేరళంలో యూడిఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల మాదిరిగానే ప్రజలకు ఇచ్చే ప్రతి హామీని కచ్చితంగా అమలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మావేలిక్కర అసెంబ్లీ నియోజకవర్గంలో యూడీఎఫ్ అభ్యర్థి ముతర రాజ్‌కు మద్దతుగా ఆదివారం నాడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు గ్యారెంటీలను పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుందని తెలిపారు. అదే విధంగా కేరళంలోకూడా యూడిఎఫ్ ప్రభుత్వం ఏర్పడితే ఐదు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కేరళంలో గత పది సంవత్సరాలుగా కొనసాగుతున్న ఎల్‌డిఎఫ్ పాలన ప్రజలను నిరాశపరిచిందని విమర్శించారు. అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక రంగాల్లో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. "కేరళం ప్రజలు ఈసారి స్పష్టమైన మార్పు కోరుకుంటున్నారు. పది సంవత్సరాల అసమర్థ పాలనకు ముగింపు పలికి, అభివృద్ధి, పారదర్శక పాలన కోసం యూడిఎఫ్‌కు అధికారం అప్పగించాలి" అని మంత్రి పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా విభజన రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య విభేదాలు పెంచే బీజేపీకి కేరళం లో స్థానం లేదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం యూడిఎఫ్ మాత్రమేనని స్పష్టం చేశారు."ఇది సాధారణ ఎన్నిక కాదు.. కేరళం భవిష్యత్తును నిర్ణయించే ఎన్నిక. ప్రజలు సరైన నిర్ణయం తీసుకుని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని గద్దె దించి, యూడిఎఫ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారు" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి ప్రచారానికి ప్రతిచోట ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

# తెలంగాణ హైకోర్టు జోన్-2 భవన నిర్మాణానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన

మొదటి పేజీ తరువాయి

న్యాయవ్యవస్థ బలోపేతం: జస్టిస్ సూర్యకాంత్

తెలంగాణ రాష్ట్రంలో పెరుగుతున్న జనాభా, న్యాయపరమైన అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. న్యాయవ్యవస్థకు అవసరమైన భవనాలు, సాంకేతికతను అందించడం ద్వారా సామాన్యులకు త్వరితగతిన న్యాయం అందుతుందని అన్నారు. కొత్త హైకోర్టు ప్రాంగణం కోసం అత్యంత విలువైన భూమిని కేటాయించినందుకు, నిర్మాణ పనులకు పూర్తి సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాన్ని జస్టిస్ సూర్యకాంత్ అభినందించారు.

# తండ్రిని చంపిన కొడుకులు.. మహిళతో అక్రమ సంబంధమే కారణమా!?

న్యూస్ డెస్క్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని రేపాక గ్రామంలో తండ్రి అక్రమ సంబంధం పెట్టుకున్నాడని అనుమానంతో కొడుకులు తండ్రిని హత్య చేసిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రేగొండ మండలంలోని రేపాక గ్రామానికి చెందిన కుర్రె చేరాలు గ్రామంలో ఒంటరిగా ఉంటుండగా, అతని భార్య కుమారుల వద్ద హైదరాబాద్ లో ఉంటున్నారు. కుమారులు శనివారం గ్రామానికి రాగా మరో మహిళతో ఉండటం గమనించి దాడి చేసినట్లు సమాచారం.

చేరాలుకు తీవ్ర గాయాలవడంతో ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మర్డర్ జరిగిన విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. మహిళా పరకాల హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. చేరాలకు భార్య సులోచన, కూతుళ్లు సరిత, సౌజన్య, కొడుకులు రామ్, లక్ష్మణ్ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కూతురు విడాకులు.. పేరెంట్స్ గ్రాండ్ సెలబ్రేషన్స్

న్యూస్ డెస్క్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): పెళ్లి అంటే నూరేళ్లు కలిసి సాగాల్సిన ప్రయాణం. కానీ కొంత మంది జీవితాల్లో ఇది పూర్తిగా భిన్నమైన పరిస్థితులు రావచ్చు. తమ జీవిత భాగస్వామితో ఏర్పడే పొరపచ్చాలు, ఇతర కారణాలతో విడాకుల వరకు దారి తీయవచ్చు. డైవర్స్ అంటే తమ తమ జీవితాల్లో అది పెద్ద విషాదమే. కానీ యూపీలోని మీరట్‌లో మాత్రం తమ కూతురుకి విడాకులు మంజూరు కావడంతో ఆమె తల్లిదండ్రులు గ్రాండ్‌గా సెలబ్రేషన్స్ చేశారు. డప్పులు వాయిస్తూ డాన్సులు చేశారు. 'ఐ లవ్ మై డాటర్' అని ముద్రించి ఉన్న టీ షర్టులు ధరించి ఆమెను పుట్టింటివారు ఆనందంగా స్వాగతించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

రిటైర్డ్ జడ్జి జ్ఞానేంద్ర శర్మ ఏకైక కుమార్తె ప్రణిత శర్మకు 2018 డిసెంబర్ 14న ఆర్మీ మేజర్‌తో వివాహం జరిగింది. ఈ జంట అన్యోన్యంగా జీవితం కొనసాగిస్తుందని బంధువులంతా భావించారు. ఎన్నో ఆశలతో అత్తారింట్లో అడుగు పెట్టిన ప్రణితకు అక్కడ పరిస్థితులు భిన్నంగా కనిపించారు. కాలం గడిచే కొద్ది అత్తామామల వేధింపులు మరింత కఠిన తరం అయ్యాయి. దీంతో ఆమె మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కొడుకు పుట్టాక కూడా పరిస్థితుల్లో మార్పు రాకపోవడంతో ఇక కఠిన నిర్ణయం తీసుకుంది. ఇక తన భర్త కుటుంబం వేధింపులను భరించలేనని తనకు విడాకులు ఇప్పించాలంటూ మీరట్ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. విచారణ జరిపిన కోర్టు 4 ఏప్రిల్ 2026న విడాకులు మంజూరు చేసింది. సైకాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ చేసిన ప్రణీత ఓ జ్యుడిషియల్ అకాడమిలో ఫైనాన్స్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. తనకు విడాకులు మంజూరైన సందర్భంగా తన అనుభవాన్ని పంచుకుంటూ ఎలాంటి వేధింపులైనా ఎదురైనప్పుడు మౌనంగా ఉండవద్దని, అలాగే మీ కూతురికి పెళ్లి చేసే విషయంలో తొందరపడవద్దని తల్లిదండ్రులకు సూచించారు. మీమీ కూతుర్లను చదివించాలని తన కాళ్లపై నిలబడేలా తీర్చిదిద్ది ఆ తర్వాతే వివాహం చేయాలని కోరారు.

## పార్టీ మారడం బట్టలు మార్చుకున్నంత సులభం కాదు

న్యూస్ డెస్క్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ బీజేపీని వీడి ఇతర పార్టీలోకి చేరుతున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రచారాంపై ఎంపీ ఈటల రాజేందర్ స్పందిస్తూ.. ఆ వార్తలను కొట్టిపారేశారు. ఆదివారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తనపై జరుగుతున్నవి 'పిచ్చి ప్రచారాలు' అని మండిపడ్డారు. తాను, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ పార్టీ మారుతున్నామన్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. అలాగే "పార్టీ మారడం అంటే బట్టలు మార్చుకున్నంత సులభం కాదని..తనపై జరుగుతున్న అసత్య ప్రచారాలకు మా పార్టీలోనే కొందరు ఊతమివ్వడం విచారకరకరమని అన్నారు.

తాను పదవుల కోసం పద్దులు మోసే వ్యక్తిని కాదు" అని ఈటల ఘాటుగా స్పందించారు. కేసీఆర్ తనను పార్టీ నుంచి బయటకు నెట్టి ఐదేళ్లు అవుతోందని, ఆనాడు తన గోడు వినేవారే లేరని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత వస్తోందని ఆయన విమర్శించారు. ముఖ్యంగా 'హైడ్రా' పేరుతో పేదల ఇళ్లను కూలగొట్టడం అరాచకమని ధ్వజమెత్తారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై సుప్రీంకోర్టులో కేసు వేస్తామని వెల్లడించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలపై ఇప్పటికే రఘునందన్ రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలతో చర్చిస్తున్నట్లు తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వంపై త్వరలోనే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు.

## ఫ్రిడ్జ్‌లో చెలరేగిన మంటలు.. ఇద్దరు దుర్మరణం

న్యూస్ డెస్క్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. బంగల్ పేట్ వద్ద మహాలక్ష్మివాడలోని సి బ్లాక్ డబుల్ బెడ్రూమ్ ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో ఫ్రిడ్జ్ పేలి అగ్నిప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న ఇద్దరికీ తీవ్రగాయాలు కావడంతో చుట్టుపక్కల స్థానికులు వెంటనే అంబులెన్సులో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ (40), ఇంటి యజమాని ఒడిసెల విజయ్ (50) మరణించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. వేసవిలో ఫ్రిడ్జ్ లు, ఏసీల వాడకాలతో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

## చౌడేశ్వరి పరువుహత్య కేసు : సీఐపై సస్పెన్షన్ వేటు



న్యూస్ డెస్క్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): పల్నాడు జిల్లాలో గత నెల 18న పరువు హత్యకు గురైన చౌడేశ్వరి కేసులో.. మాచర్ల సీఐ వెంకట రమణపై సస్పెన్షన్ వేటు పడింది. ఆమె హత్యకేసులో తల్లిదండ్రులతోపాటు సీఐ పాత్ర కూడా ఉందని విచారణలో తేలడంతో.. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అతన్ని వెంటనే సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రియుడు నాగరాజును పెళ్లి చేసుకున్న కూతురిపై చౌడేశ్వరి తల్లిదండ్రులు కోపం పెంచుకున్నారు. తమను కాదని వెళ్లిపోయిన కూతుర్ని అంతమొందించాలని భావించారు. ఇందుకు చౌడేశ్వరిని తిరిగి ఇంటికి తీసుకొచ్చేందుకు సీఐ వెంకటరమణ సహకరించాడు. ఈ పనికోసం సీఐ వారి నుంచి భారీగా డబ్బు తీసుకున్నట్లు తేలింది. తొలుత ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించగా.. ఆ సమయంలో సీఐ లేకపోవడంతో ఆ కుట్రలేవీ సాగలేదు. పోస్టుమార్టం రిపోర్టులో ఆత్మహత్య కాదని తేలడంతో అసలు విషయం బయటపడింది. సీఐపై ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు అతని పాత్రపై విచారణ చేశారు. కీలకంగా వ్యవహరించాడని తేలడంతో సస్పెండ్ చేశారు.

## ఇన్ స్టాగ్రామ్ లవ్.. మచిలీపట్నంలో యువతి ఆత్మహత్య

న్యూస్ డెస్క్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): రాష్ట్రంలోని కృష్ణాజిల్లా మచిలీపట్నం గొడుగుపేటలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఇన్ స్టాగ్రామ్ లో పరిచయమైన వ్యక్తి ప్రేమ పేరుతో మోసం చేయడంతో యువతి ఆత్మహత్యకు పాల్పడింది. రూ.5 లక్షలు కట్నం ఇస్తేనే పెళ్లికి ఒప్పుకుంటానని తెగేసి చెప్పడంతో చేసేది లేక ఎలుకల మందు మింగింది. గొడుగుపేటకు చెందిన రాగశ్రీకి ఇన్ స్టాగ్రామ్ లో కోనసీమ జిల్లా మండపేటకు చెందిన లీలా కుమార్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. వారిద్దరి పరిచయం ప్రేమగా మారింది. రాగశ్రీ పెళ్లి ప్రస్తావన తీసుకురాగా.. తనకు రూ.5 లక్షలు కట్నం ఇస్తేనే పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. మనస్తాపంతో రాగశ్రీ ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాగశ్రీ మరణించింది. కూతురి ఆత్మహత్యపై తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రేమ పేరుతో తనకూతురిని లీలా కుమార్ ఇబ్బంది పెట్టాడని, అతన్ని అరెస్ట్ చేసి, శిక్షించాలని డిమాండ్ చేశారు. రాగశ్రీ ఆత్మహత్య స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# కుప్పకూలిన 4 అంతస్తుల భవనం.. ఇద్దరు మృతి, శిథిలాల కింద మరికొందరు!

మొదటి పేజీ తరువాయి

ఈ ప్రమాదంలో ఇప్పటివరకు ఇద్దరు వ్యక్తులు మరణించగా, శిథిలాల కింద మరికొంతమంది చిక్కుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. కోత్కా ప్రధాన మార్కెట్ ప్రాంతంలోని ఒక 4 అంతస్తుల పాత భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ప్రమాదం జరిగిన సమయంలో భవనంలో నివసిస్తున్న వారితో పాటు కింద ఉన్న దుకాణాల్లో కొందరు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. శిథిలాల నుంచి ఇప్పటివరకు ఇద్దరి మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు తెలిపారు. అలాగే గాయపడిన మరో ముగ్గురిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఈ ఘోర ప్రమాద సమాచారం అందిన వెంటనే జిల్లా యంత్రాంగం, ఎన్డీఆర్ఎఫ్, స్థానిక పోలీసులు రంగంలోకి దిగారు. జేసీబీల సహాయంతో శిథిలాలను తొలగించి లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. రాత్రి నుంచి ఈ రెస్క్యూ ఆపరేషన్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రమాదంలో కూలిన భవనం చాలా పాతది కావడం, ఇటీవలే కురిసిన వర్షాల వల్ల పునాదులు బలహీనపడటం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అయితే, దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. శిథిలాల కింద ఇంకా ఎంత మంది ఉన్నారనేది స్పష్టంగా తెలియకపోవడంతో గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి.

## లోయలో పడ్డ పర్యాటకుల వాహనం.. నలుగురు మృతి

మొదటి పేజీ తరువాయి

బంజార్ సబ్ డివిజన్ పరిధిలోని ఖియాగి సమీపంలో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. పర్యాటకులు ప్రయాణిస్తున్న టెంపో ట్రావెలర్ నియంత్రణ తప్పి రహదారి పక్కనే ఉన్న లోతైన లోయలోకి దూసుకెళ్లినట్లు గుర్తించారు.

భారీ వర్షాల కారణంగా రహదారిపై ఏర్పడిన బురద, జారే స్వభావం వల్ల వాహనం స్కిడ్ అయ్యి లోయలో పడిపోయినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలో మొత్తం 22 మంది ఉన్నారని,.. ప్రమాద సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే ఈ ప్రమాదంలో గాయపడిన వారిని వెంటనే బంజార్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు.

వీరిలో ఒకరి పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పర్యాటకులంతా ఢిల్లీ నుంచి కులు మనాలీ సందర్శనకు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి గురైన వారు జిబి లోని ఒక హోటల్‌లో బస చేస్తున్నట్లు సమాచారం. మృతుల వివరాలను సేకరించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.


# అజారుద్దీన్‌కు టైమ్ లిమిట్ టెన్షన్ ఏప్రిల్ 30 డెడ్‌లైన్ కీలకం

మొదటి పేజీ తరువాయి

ఆ తర్వాత రాష్ట్ర మంత్రివర్గం అమీర్ అలీ ఖాన్ స్థానంలో అజారుద్దీన్ పేరును చేర్చి.. మళ్లీ కోదండరాం, అజారుద్దీన్ పేర్లను సిఫార్సు చేసింది. ఈ అంశం న్యాయస్థానంలో ఉండటంతో వారు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయలేదు. ఈ లోగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రావడంతో.. ఆ సమయంలో అజారుద్దీన్ ను మంత్రిగా నియమించారు. దీంతో ఆయన ఆరు నెలల్లోగా ఎమ్మెల్సీగా ఎన్నిక కావాల్సి అనివార్యత ఏర్పడింది. అయితే కోదండరాం, అజారుద్దీన్ ఎమ్మెల్సీల వ్యవహారంపై ఇటీవల సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసినట్లు శాసనసభా నిపుణులు చెబుతున్నారు. తెలంగాణలో ఎమ్మెల్సీలను ఎంపిక చేసేందుకు తమ ఉత్తర్వులు అడ్డంకి కావని చెప్పినట్లు పేర్కొంటున్నారు. ఇప్పటికే కోదండరాం, అజారుద్దీన్ ల ఫైల్ గవర్నర్ దగ్గర పెండింగ్ ఉన్నదని, దానికి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఇద్దరు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారానికి లైన్ క్లియర్ అవుతుందని అధికార వర్గాలు చెప్తున్నాయి. ఆ విధంగా కాకపోతే మరోసారి మంత్రివర్గం అజారుద్దీన్ పేరును గవర్నర్ కోటాలో సిఫార్సు చేయాల్సి ఉంటుందని చెప్తున్నారు. అయితే గవర్నర్ కోటా ఎంపికకు రాష్ట్ర కేబినెట్ మళ్లీ తీర్మానాన్ని చేస్తుందా? లేక గతంలో కోదండరాం, అజారుద్దీన్ పేర్లను ఎంపిక చేస్తూ చేసిన తీర్మానాన్ని ఆమోదించమని గవర్నర్ ను ప్రభుత్వం కోరుతుందా? అనే అంశం ఇప్పుడు కీలకంగా ఉంది. ఈ నెల 30 లోపు రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని తేలిస్తే.. అజారుద్దీన్ మంత్రిగా కొనసాగేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఈ వ్యవహారంలో గవర్నర్ నిర్ణయమే అత్యంత కీలకంగా మారింది. మొత్తానికి అజారుద్దీన్ మంత్రి పదవి వ్యవహారం ఈ నెలలోనే తేల్చాల్సిన పరిస్థితులు నెలకొనడంతో రాజకీయంగా ఈ అంశం ఉత్కంఠకు గురిచేస్తున్నది.

# పాలమూరులో హైటెక్ వ్యభిచారం

మొదటి పేజీ తరువాయి



వైఫల్యమా? పరోక్ష సహకారమా?

బలమైన ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉన్నప్పటికీ, ఇంత పెద్ద స్థాయిలో ఆరేళ్లుగా దందా సాగుతుంటే పోలీసులు కనీసం కనిపెట్టలేకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలు నివసించే కాలనీల్లో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు సాగడం వల్ల సామాన్య ప్రజలు, యువత పెడదారి పట్టే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇంత బహిరంగంగా సాగుతున్న ఈ దందా వెనుక ఎవరున్నారన్న చర్చ జిల్లా కేంద్రంలో జోరుగా సాగుతుంది.

పోలీసుల కళ్ళు గప్పి..

గత ఆరు సంవత్సరాలుగా జిల్లా కేంద్రంలో నిర్వాహకులు పోలీసుల కళ్ళు గప్పి తమ తతంగాలను కొనసాగించడం విమర్శలకు దారి తీసింది. చిన్న సంఘటన జరిగిన పోలీసుల దృష్టికి వస్తుంది. కానీ వందలాది మందితో హైటెక్ స్థాయిలో జరుగుతున్న ఈ వ్యవహారాలు అత్యంత పకడ్బందీగా జరగడంతో పోలీసులు సైతం పసిగట్టలేకపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ చీకటి సామ్రాజ్యంపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

## విద్యుత్ ఘాతంతో అన్నదాత మృతి



(క్రాంతి న్యూస్)మోత్కూర్ 05ఏప్రిల్: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున ఒక విషాదకర సంఘటన చోటుచేసుకుంది. సాగునీరు అందించే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై దొండ కొమురయ్య అనే రైతు ప్రాణాలు కోల్పోయారు. పాటిమట్ల గ్రామానికి చెందిన కొమురయ్య పొలాన్ని సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ప్రస్తుతం పంటకు నీరు అవసరం ఉండటంతో, ఆదివారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. అక్కడ మోటార్ స్విచ్ ఆన్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయారు.చాలా సేపటికీ కొమురయ్య తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బావి వద్దకు వెళ్లి చూడగా, ఆయన అచేతనంగా పడి ఉండటాన్ని గమనించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. కష్టపడి సాగు చేసిన పంట చేతికి వచ్చే తరుణంలో యజమాని ఇలా ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది.

## నేతన్నల ఉపాధికి నష్టం కలిగించే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

### ప్రభుత్వ రంగ సంస్థ టెస్కో ద్వారానే కొనుగోలు చెయ్యాలి

### -గుండు వెంకటనర్సు చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి



మోత్కూర్ 05ఏప్రిల్ (క్రాంతి న్యూస్) చేనేత సహకార సంఘాలలో కార్మికులకు పని కల్పించి (టెస్కో) రాష్ట్ర చేనేత సహకార సంఘం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు సంక్షేమ హాస్టలకు యూనిఫాం మరియు దుప్పట్లు టెండర్ల ద్వారా సరఫరా చేస్తుందని , కాని ప్రభుత్వం టెస్కో టెండర్లను రద్దుచేసి, ప్రైవేట్ సంస్థలకు అప్పచెప్పాలనే ఆలోచన చేనేత కార్మికుల పొట్టకొట్టడమే కాక టెస్కో ను నిర్వీర్యం చేయడమేనని, ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రోజున ఆయన మోత్కూర్ లో పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ. దశబ్దాలుగా విద్యాశాఖ, సంక్షేమ శాఖల పరిధిలోని విద్యార్థుల యూనిఫామ్ తో పాటు దుప్పట్లు తయారీ బాధ్యతను చేనేత సహకార సంఘాల ద్వారా (టెస్కో) రాష్ట్ర చేనేత సహకార సంఘం నిర్వహిస్తుందని, 2026-27 విద్యా సం రానికి విద్యార్థుల యూనిఫాం తయారీకి రూ 105,50 కోట్ల టెస్కో కు ఇచ్చిన టెండర్ ను రద్దుచేసి, ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయంతో చేనేత కార్మికులకులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదనవ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉన్న విద్యా శాఖతో పాటు వివిధ సంక్షేమ శాఖల నుండి వచ్చే అర్ధర్లు కూడ నిలిపివేయడంతో కార్మికులు ఆందోళనకు గురైనవుతునారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత సహకార సంఘాలు ప్రభుత్వ ఆదరణ కరువై, ఇప్పటికే పనికల్పించలేక సంఘాలు, పనులులేక కార్మికులు ఇబ్బందులు పడుతుండగా ప్రభుత్వం అర్ధర్లు నిలిపి వేయడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రైవేటు సంస్థలకు టెండర్ రద్దుచేసి, ప్రభుత్వ సంస్థ టెస్కో కు అర్ధర్లు కేటాయించేలా నిర్ణయం తీసుకోవాలని, వివిధ శాఖలనుండి వచ్చే అర్ధర్లను చేనేత సహకార సంఘాలకు అప్పగించి, సంఘాల అభివృద్ధితో పాటు కార్మికులు ఉపాధికోల్పోకుండా చూడాలని కోరారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



మోత్కూర్ 05ఏప్రిల్ (క్రాంతి న్యూస్): భారత మాజీ ఉప ప్రధాని, సామాజిక విప్లవకారుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బూసి మహేష్ మరియు జిల్లా కార్యదర్శి కొంపెల్లి భాస్కర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ"బాబు జగ్జీవన్ రామ్ ఒక వ్యక్తి కాదు, ఆయన ఒక గొప్ప సాంఘిక మరియు రాజకీయ శక్తి. బీహార్‌లోని ఒక సాధారణ గ్రామంలో జన్మించి, దేశ ఉప ప్రధాని స్థాయికి ఎదిగిన ఆయన ప్రస్థానం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, సమాజంలో సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిది.చరిత్రలో ఎందరో పదవులు అనుభవించినా, చరిత్ర గతిని మార్చిన వారు కొందరే ఉంటారు. అటువంటి అరుదైన నాయకులలో బాబుజీ ఒకరు. కేంద్ర మంత్రిగా, రక్షణ మంత్రిగా మరియు హరిత విప్లవానికి బాటలు వేసిన వ్యవసాయ మంత్రిగా ఆయన చూపిన అసమాన ప్రజ్ఞాపాటవాలు నేటికీదేశాభివృద్ధికి పునాదులుగా ఉన్నాయి. అర్ధ శతాబ్దానికి పైగా రాజకీయాల్లో ఉండి, మచ్చలేని నాయకుడిగా మేరు పర్వతంలా నిలిచిన బాబుజీ ఆశయాలను ఎం.ఆర్.పి.ఎస్ నిరంతరం ముందుకు తీసుకెళ్తుంది." అని పేర్కొన్నారు.

# మోత్కూరులో ముగిసిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్

మోత్కూర్ 05ఏప్రిల్ (క్రాంతి న్యూస్): సైద్ధాంతిక సిద్ధాంతం కలిగిన పార్టీలే ప్రజలు ఆదరిస్తారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ళ వీరేందర్ గౌడ్ జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలత రెడ్డి అన్నారు ఆదివారం మోత్కూర్ మున్సిపాలిటీ కేంద్రంలో జరిగిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాబియన్ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడుతూ పార్టీ నిర్మాణం బూతు స్థాయి నుండి పార్టీని బలోపేతం చేసినప్పుడే పార్టీ అధికారంలోకి రాగలరని అన్నారు అవినీతికి వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం చేయటం వలనే భారత దేశంలో బిజెపి అతిపెద్ద పార్టీగా ఆవరించి అధికారంలోకి వచ్చిందని అన్నారు రాబోయే రోజుల్లో తెలంగాణలో కచ్చితంగా బిజెపి పార్టీ అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త సైనికులు వల్లే పనిచేయడం అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణన సర్వేలో సర్ ప్రతిష్టంగా అయ్యేటట్టు బి ఎల్ ఓల కు సహకరించాలని కోరారు నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి అమలు అయ్యేటట్టు చూడాలని అన్నారు ఈ కార్యక్రమానికి పట్టణ అధ్యక్షులు చాడ మంజుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వంగవీటి శ్రీనివాసరావు ప్రశిక్షణ ప్రబారి గౌరీ శ్రీనివాస్ మోత్కూరు రూరల్ మండల అధ్యక్షులు గూడెం మధుసూదన్ అడ్డగూడూరు అధ్యక్షులు అనుబోతు సైదులు జిల్లా నాయకులు కొన్నతం నాగార్జున రెడ్డి భయాన్ని చంద్రశేఖర్ కూరాకుల వెంకన్న పోచం సోమయ్య ఏనుగు జితేందర్ రెడ్డి చేకూరి మల్లేశం జినుకల దశరథ అన్నెపు సత్యనారాయణ యేశపోయిన రమణ మధు సోమేశ్వరి వనం రేణుక ఎడ్ల రాము రమాదేవి దొంతర పోయిన ధనలక్ష్మి సత్యనారాయణ గొడుగు కవిత చంద్రమౌళి మోత్కూరు బ్రహ్మాచారి బిమిడి తిరుమల్ రెడ్డి బండ నరసింహ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



వికారాబాద్ , 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): జిల్లా కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రా, మున్సిపల్ చైర్మన్ గడ్డం అనన్య పాల్గొని బిజెఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ ప్రముఖులు,అధికారులు వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు మరియు కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దేశానికి జగ్జీవన్ రామ్ చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండలం దళిత అవార్డు గ్రహీత నారెగూడెం మల శివరాజ్ గారు మాట్లాడుతూ డా" బాబు జగ్జీవన్ రామ్ గారి 118 వ ఉత్సవ సామాజిక విప్లవ శుభాకాంక్షలు ఈ దేశం లో సామాజిక, ఆర్థిక, అసమానతల నుండి మానవ అభివృద్ధి సాధించడం లో బిజెఆర్ తన జీవితం మొత్తం కృషి చేశారు విద్యార్థి దశ లోనే పాఠశాలలో విద్యార్థుల తాగునీటి కోసం కుండలు వెనుకబడిన వర్గలమీద వివక్ష తో అంటారని వారికోసం అని అణగారిన వర్గల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుండను బాద్దలు కొట్టి బిజెఆర్ తన తిరుగుబాటు నిరసన తెలియజేశారు జనాభా కు సరిపడా ఆహార ధాన్యాల కొరత ఉండి ఆహార ధాన్యం సరిగ్గా అందుబాటులో లేనప్పుడు హరిత విప్లవం తో వ్యవసాయ సంస్కరణలు తీసుకురావడం జరిగింది ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేసే ఎస్సీ, ఎస్టీ వర్గాల ఉద్యోగుల ఉన్నతి కోసం వాళ్ళ యొక్క అభివృద్ధి కోసం అనేక సంస్కరణలు చేయడం జరిగింది ఈ దేశం మొదటి కార్మిక శాఖ మంత్రిగా బిజెఆర్ ఉన్నపుడు ప్రధానంగా కార్మిక వర్గం లో సామాజికంగా వెనుకబడిన వర్గాలే ఉన్నారని ప్రధానంగా కార్మిక వర్గం అభివృద్ధి కోసం 1 కనీస వేతన చట్టం, 2 ఈఎస్ఐ చట్టం, 3 ప్రావిడెంట్ ఫండ్ చట్టం, 4 పారిశ్రామిక వివాదాల చట్టం, 5 ట్రేడ్ యూనియన్ చట్టం ఇలాంటి కార్మిక వర్గానికి దోహదపడే చట్టాలను తేవడంలో బిజెఆర్ గారి కృషి మరువలేనిది ఈ చాటాలని కార్మిక వర్గానికి రక్షణ కవచంగా ఉన్నాయి మహనీయుల కృషితో అనేక ప్రజా పోరాటాలతో ఏర్పడినటువంటి కార్మిక చట్టాలను కుదిస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నాఇ నేటి కార్పొరేట్ ప్రభుత్వాలు ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు రాయితీలు ఇస్తూ ప్రభుత్వ ఆస్తులను దార దత్తం చేస్తూ కార్పొరేట్ సంస్థల కోసం ఊడిగం చేస్తూ అణగారిన వర్గాలు, వెనుకబడిన వర్గాలు, కార్మిక వర్గాలను వారి హక్కుల కోసం మాట్లాడనీయకుండా నొక్కి వేస్తూ శ్రమ దోపిడీకి గురి చేస్తూ కనపడని రూపంలో వివక్షను కొనసాగిస్తూనే ఉన్నారు కష్టజీవులు, కార్మికులు, పేదలు, బడుగు బలహీన వర్గాల యొక్క సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధి సాధించే దిశగా మహనీయుల స్ఫూర్తితో సామాజిక, ఆర్థిక, రాజకీయ వివక్షకు వ్యతిరేకంగా పోరాడుదాం! మహనీయుల ఆశయాలను సాధిద్దాం అని పేర్కొన్నారు

## బాబు జగజ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగిద్దాం-ఎమ్మెల్యే మందుల సామెల్





మోత్కూర్ 05ఏప్రిల్ (క్రాంతి న్యూస్)యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీ కేంద్రంలో ఆదివారం భారత మాజీ ఉప ప్రధాని, బాబు జగజ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మున్సిపల్ కేంద్రంలోని బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో, ముఖ్యంగా అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జగజ్జీవన్ రామ్ చేసిన కృషి మరువలేనిదని.జగజ్జీవన్ రామ్ కేవలం ఒక కులానికో, వర్గానికో పరిమితమైన నాయకుడు కాదని, దేశవ్యాప్తంగా ఉన్న పేద ప్రజల గుండెల్లో నిలిచిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, నేటి తరానికి వారి గొప్పతనాన్ని వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య కౌన్సిలర్లు నల్ల మధు యాదవ్ మొగుల అనురాధ.ఘనగాని శైలజ పొన్నాల శ్రీవిద్య.కారబోతుల వెంకన్న.శ్రీకాంత్ గౌడ్. మెంట రమణ. కురిమిళ్ళ ప్రమీల పట్టణ అధ్యక్షులు గుండెగోని రామచంద్ర గౌడ్. జిల్లా ఉపాధ్యక్షులు పైల్ల సోమిరెడ్డి మండల కార్యదర్శి రాచకొండ బాలరాజు కాంగ్రెస్ నాయకులు లక్ష్మీ నరసింహ రెడ్డి మార్కెట్ డైరెక్టర్లు పన్నాల శ్రీనివాస్ రెడ్డి మరియు ఎండి సమీర్ మున్సిపల్ అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మోత్కూరులో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు






మోత్కూర్ 05ఏప్రిల్ (క్రాంతి న్యూస్) దేశంలో సామాజిక న్యాయ సాధనకు, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన భారత మాజీ ఉప ప్రధాని, స్వర్గీయ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను మోత్కూరు మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఆదివారం స్థానిక కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశ రాజకీయాల్లో జగ్జీవన్ రామ్ చెరగని ముద్ర వేశారని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక సమానత్వం కోసం ఆయన పడ్డ తపన నేటి తరానికి ఆదర్శనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్, పట్టణ అధ్యక్షులు జంగ శ్రీను, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు కొణతం యాకోబు రెడ్డి, చిప్పలపల్లి మహేంద్రనాథ్, ఆర్ఎస్ఎస్ మాజీ అధ్యక్షులు కొండ సోమల్లు, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేష్ మాజీ సర్పంచ్‌లు బయ్యని పిచ్చయ్య, బత్తిని తిరుమలేష్, జిల్లా నాయకులు దాసరి తిరుమలేష్, చేల్లోటి నరేష్, పురుగుల మల్లయ్య, జంగ సతీష్, చేతరాశి వెంకన్న, అన్నందాసు విద్యాసాగర్, చెడిపల్లి రఘుపతి, కోక బిక్షం, కంచర్ల క్రాంతి కుమార్ రెడ్డి, నల్ల ప్రభాకర్, జిట్ట సాయికుమార్, పొన్నెబోయిన మచ్చగిరి, దాసరి నవీన్, దాసరి నరేష్, కూరెళ్ల రమేష్, చుక్క అశోక్, బందేల శ్రీను, కాల్వ శోభన్, అన్నందాసు మచ్చగిరి, మల్లికార్జున మరియు ఇతర పార్టీ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తహశీల్దార్ నుంచి 50 లక్షలు కాజేసిన నకిలీ ఏసీబీ అధికారి.. ఐదేళ్ల తర్వాత అరెస్టు



ఏపీ న్యూస్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఏసీబీ అధికారిగా నటించి తహశీల్దార్‌ను బురిడీ కొట్టించి రూ.50 లక్షలు కాజేసిన ఓ కేటుగాడిని పోలీసులు అరెస్టు చేశారు. గత ఐదేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న మోసగాడినికి చివరకు సత్యసాయి జిల్లాలో అరెస్టు చేశారు.

అసలేమైందంటే.. 2021లో అనంతపురం జిల్లా ముదిగబ్బులో తహశీల్దార్‌గా పనిచేస్తున్న అన్వర్ హుస్సేన్‌కు ఓ వ్యక్తి కాల్ చేశాడు. తాను ఏసీబీ అధికారిని అని నమ్మించాడు. అవినీతి కేసులు పెట్టిస్తానని భయపెట్టి రూ.50 లక్షలు ఇవ్వాలని బెదిరించాడు. భయపడిపోయిన తహశీల్దార్ వెంటనే నకిలీ ఏసీబీ అధికారికి రూ.50 లక్షలు ఇచ్చాడు. డబ్బు చేతిలో పడగానే కాల్ చేసిన వ్యక్తి కనిపించకుండాపోయాడు. అప్పట్లోనే మోసపోయానని గ్రహించిన అన్వర్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అనంతపురం జిల్లా కూడేరు మండలం కలగల్లు గ్రామానికి చెందిన ఎరుకల హనుమంతుగా గుర్తించారు.

అయితే గత ఐదేళ్లుగా హనుమంతు ఆచూకీ దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో పోలీసులు సాంకేతిక ఆధారాలు, గోప్య సమాచారంతో నిందితుడి కదలికలను కొంతకాలంగా గమనిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో నిన్న అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారిస్తే మరిన్ని వివరాలు బయటకొచ్చే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

## అగ్నికి ఆహుతైన ఆర్టీసీ బస్సు..

### కడప జిల్లాలో ప్రయాణికులకు తప్పిన పెను ప్రమాదం



ఏపీ న్యూస్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): కడప జిల్లాలో ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. వేంపల్లి మండలం వీరన్నగట్టుపల్లి వద్ద పల్లె వెలుగు బస్సుకు విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తం కావడంతో బస్సులోని 21 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. బస్సులో నుంచి మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన సిబ్బంది, ప్రయాణికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలికి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. కానీ అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. కాగా, అప్రోచ్ రోడ్డుకు మట్టి ఎక్కువగా వేయడంతో విద్యుత్ లైన్ బస్సుకు తాకి ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు.

## మద్యం దుకాణం వద్ద దారుణం.. వ్యక్తిని రాళ్లతో కొట్టి చంపిన దుండగులు




ఏపీ న్యూస్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): గుంటూరు జిల్లా తాడికొండలో ఓ మద్యం దుకాణం వద్ద ఆదివారం దారుణం జరిగింది. మరియదాసు అనే వ్యక్తిని నలుగురు దుండగులు చుట్టుముట్టి, రాళ్లతో అతి కిరాతకంగా కొట్టి హతమార్చారు. బహిరంగ ప్రదేశంలో అందరూ చూస్తుండగానే జరిగిన ఈ దాడి స్థానికంగా తీవ్ర భయాందోళనలను కలిగించింది. తీవ్ర గాయాలపాలైన మరియదాసు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు.

స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ హత్యకు పాత కక్షలే ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. త్వరలోనే నిందితులను అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.

## బీర్ బాటిల్‌పై వేరే కంపెనీ మూత



ఏపీ న్యూస్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): మండిపోతున్న ఎండలకు చల్లగా ఓ బీర్ తాగుదామనుకునే మద్యం ప్రియులకు కల్తీ మద్యం భయపెడుతోంది. ఒక బ్రాండ్ బీర్ బాటిల్ కు మరో బ్రాండ్ మూత ఉండటం కలకలం రేపుతోంది. ఇందుకు సంబంధించిన ఓ వీడియో తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఘటన ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గంలో జరిగినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. జరుగుతున్న ప్రచారం ప్రకారం కాజా గ్రామంలో ఉన్న వైన్స్ లో ఓ వ్యక్తి ఓ ప్రముఖ బ్రాండ్‌కు చెందిన బీర్ ను కొనుగోలు చేశాడు. తీరా చూశాక ఈ తేడాను గమనించిన సదరు వ్యక్తి వెంటనే వైన్ షాప్ సిబ్బందిని నిలదీయడంతో తమకు స్టాక్ ఇలాగే వచ్చిందని చెప్పారు.

## జగన్‌ను చూస్తే తుగ్లక్ పాలన గుర్తుకొస్తోంది : ఏపీ మంత్రుల తీవ్ర విమర్శలు



ఏపీ న్యూస్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్‌ను చూస్తే తుగ్లక్ పాలన గుర్తుకొస్తోందని పార్థసారథి వ్యాఖ్యానించారు. విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదని అన్నారు. మంగళగిరిలో మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడుతూ.. తుగ్లక్ పేరు వినడమే తప్ప చూడలేదని, కానీ జగన్‌ను చూస్తే ఆయనే గుర్తుకొస్తున్నారని చెప్పారు.

మూడు రాజధానుల పేరుతో ఆయన మూడు ముక్కలాట ఆడారని పార్థసారథి విమర్శించారు. తాను చెప్పిందే అందరూ వినాలనే ధోరణివల్లే ప్రజలు ఎన్నికల్లో తగిన తీర్పు ఇచ్చారని మండిపడ్డారు. చంద్రబాబుపై నమ్మకంతోనే రైతులు రాజధానికి భూములు ఇచ్చారని, అలాంటి రైతులను అవమానించిన వైసీపీకి భవిష్యత్తులో పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. మరోవైపు శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. తెలుగు జాతిపైన, అమరావతిపైన జగన్‌కు ఎందుకంత కక్ష..? అని ప్రశ్నించారు.

జగన్ మొదట అమరావతిని రాజధానిగా అంగీకరించారని, అధికారంలోకి రాగానే మూడు రాజధానులంటూ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆగిపోయిన రాజధాని నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించామని ఆయన చెప్పారు. జగన్‌కు విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని మంత్రి అన్నారు.

## పిడుగుపాటుకు తల్లీకూతుళ్ల మృతి



ఏపీ న్యూస్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ప్రకృతి ప్రకోపానికి శ్రీకాకుళం జిల్లా మందస మండలం పెద్దకేసుపురం గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు బలవ్వడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామంలో ఆదివారం అకస్మాత్తుగా వాతావరణం మారింది. వెంటనే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగుపడటంతో తల్లి కృష్ణవేణి, ఆమె కుమార్తె యోగేశ్వరి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కళ్లెదుటే ఇద్దరు సభ్యులు విగతజీవులుగా పడి ఉండటంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఈ ఘటనతో పెద్దకేసుపురం గ్రామం ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనైంది. పొలం పనుల్లో ఉన్న సమయంలోనో లేదా ఇంటి సమీపంలో ఉన్నప్పుడో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమికంగా భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆకస్మికంగా కురిసిన పిడుగు తల్లీకూతుళ్ల ప్రాణాలను బలి తీసుకోవడంతో గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది.

## చూస్తూ ఊరుకోను.. తిరగబడతా..? ఎమ్మెల్యే బొజ్జలకు వినుత కోట వార్నింగ్



ఏపీ న్యూస్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): జనసైనికులపై పడితే చూస్తూ ఊరుకోనని, తిరగబడతానని శ్రీశైలం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి జనసేన పార్టీ ఇంచార్జి వినుత కోట వార్నింగ్ ఇచ్చారు. అనుమతులు లేవంటూ మున్సిపల్ అధికారులు జనసేన కార్యకర్త శివ కుమార్ ఇంటిని కూల్చి వేశారు. ఈ కూల్చివేత ప్రాంతాన్ని వినుత కోట పరిశీలించి బాధితుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఎవడబ్బ సొమ్మని జనసైనికుల మీదకు వస్తున్నావ్..? అంటూ మండిపడ్డారు. జనసేన పార్టీ కార్యకర్త కుటుంబాన్ని టెర్రరిస్టుల మాదిరిగా ట్రీట్ చేస్తారా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాళ్ల ల్యాండ్‌లో వాళ్లు ఇల్లు కట్టుకుంటే తమ దౌర్జన్యమేంటి అని వ్యాఖ్యానించారు. తమరేదైనా చేయాలనుకుంటే నోటీసులు ఇచ్చి అఫీషియల్‌గా చేయాలన్నారు. జనసేనను తొక్కాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. పవన్ కల్యాణ్‌ను చూసి ఊరుకుంటున్నానని.. తిరగబడితే సుధీర్‌రెడ్డికే నష్టమని హెచ్చరించారు. గత ఐదు సంవత్సరాలు సుధీర్‌రెడ్డి గోవా, ముంబైలో పబ్బుల్లో ఉన్నారని, కష్టం తాముపడితే.. చివరి నిమిషంలో వచ్చి ఎమ్మెల్యే సీటును కొట్టుకుపోయారని వినుత కోట ఆరోపించారు.

## పెన్నా నదిలో ముగ్గురు విద్యార్థుల గల్లంతు



ఏపీ న్యూస్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): కడప జిల్లా పుష్పగిరిలో విషాదం చోటు చేసుకుంది. సరదాగా స్నానానికి వెళ్లిన ముగ్గురు యువకులు నది ప్రవాహంలో గల్లంతయ్యారు. వీరంతా కడప కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులుగా గుర్తించారు. ఆదివారం కావడంతో కొంతమంది విద్యార్థులు పుష్పగిరి క్షేత్రం వద్ద పెన్నా నదిని సందర్శించారు. నదిలో స్నానం చేసేందుకు దిగిన సమయంలో నీటి లోతును సరిగ్గా అంచనా వేయలేక ముగ్గురు విద్యార్థులు ప్రవాహంలో కొట్టుకుపోయారు. విషయం తెలుసుకున్న వెంటనే వల్లూరు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.గల్లంతైన వారిలో ఒకరిని ఒడ్డుకు చేర్చిన పోలీసులు.. ప్రాణాలు కాపాడేందుకు సిపిఆర్ చేస్తూ తీవ్రంగా ప్రయత్నం చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మరో ఇద్దరు విద్యార్థుల కోసం పోలీసులు, స్థానికులు కలిసి నదిలో ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ ఘటనతో విద్యార్థుల కుటుంబాల్లో, కళాశాలలో తీవ్ర విషాదం నెలకొంది.

## పోలీసులకు అన్ని విషయాలు చెప్పా జనసేన నాయకుడు తాతంశెట్టి నాగేంద్ర



ఏపీ న్యూస్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): పోలీసులకు అన్ని విషయాలు చెప్పానని రైల్వే కోడూరు జనసేన నాయకుడు తాతంశెట్టి నాగేంద్ర తెలిపారు. హర్షవీణపై దాడి ఘటనలో ఆయనను పోలీసులు విచారించారు. తాతంశెట్టి నాగేంద్రతో పాటు నవీన్‌లను రేణిగుంట డీఎస్పీ ఐదు గంటల పాటు విచారించారు. విచారణ ముగియడంతో తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడారు. దాడి ఘటనపై పోలీసులకు అన్ని వివరాలు వెల్లడించానని చెప్పారు. విచారణకు పూర్తిగా సహకరించామని తాతంశెట్టి పేర్కొన్నారు. ఎప్పుడూ పిలిచినా రావాలని పోలీసులు సూచించారని తెలిపారు. తాము ఎప్పుడూ సిద్ధమేనని పోలీసులకు తాను తెలిపినట్లు తాతంశెట్టి నాగేంద్ర పేర్కొన్నారు.

కాగా రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాధితురాలు హర్షవీణపై తాతంశెట్టి నాగేంద్ర కర్రతో దాడి చేశారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తాతంశెట్టి నాగేంద్రపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగా శనివారం విచారణకు రావాలని నోటీసులివ్వడంతో ఆయన హాజరయ్యారు. సుదీర్ఘ విచారణకు అన్ని సమాధానాలు చెప్పినట్లు తాతంశెట్టి స్పష్టం చేశారు.

## విదేశాలకు వెళ్లొచ్చిన అర్చకులకు షాకిచ్చిన హైకోర్టు



ఏపీ న్యూస్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఆధ్యాత్మిక, ధార్మిక నిబంధనల అమలుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఒక కీలక తీర్పును వెలువరించింది. విదేశీ ప్రయాణం చేసిన అర్చకులు దేవాలయాల్లోని ప్రధాన గర్భాలయాల్లోకి ప్రవేశించి పూజలు నిర్వహించడంపై ఉన్న నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దేవాదాయ శాఖ, శృంగేరి శారదా పీఠం గతంలో జారీ చేసిన మార్గదర్శకాలను ప్రభుత్వం ఉల్లంఘిస్తోందంటూ దాఖలైన పిటిషన్‌పై విచారించిన జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఈ తీర్పును వెలువరించారు.

2010లో దేవాదాయ శాఖ జారీ చేసిన సర్క్యులర్, 2024 డిసెంబరులో శృంగేరి శారదా పీఠం జగద్గురువులు శ్రీ భారతీ తీర్థ స్వామివారు విడుదల చేసిన 'ప్రామాణిక' పత్రాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. వీటి ప్రకారం గర్భాలయంలో పూజలు చేసే అర్చకులు కఠినమైన ఆధ్యాత్మిక క్రమశిక్షణ పాటించాలి. నిత్యం త్రికాల సంధ్యావందనం, గురు ఉపదేశ మంత్ర జపం, వేద అధ్యయనం, కఠినమైన ఆహార నియమాలు పాటించేవారే గర్భాలయ పూజలకు అర్హులు. సంప్రదాయ ధర్మశాస్త్రాల ప్రకారం, అర్చకులు విదేశాలకు వెళ్లడం నిషిద్ధం. ఒకవేళ ఎవరైనా అనివార్య కారణాల వల్ల విదేశీ ప్రయాణం చేస్తే, వారు తిరిగి వచ్చాక గర్భాలయంలోకి ప్రవేశించడానికి వీల్లేదు. వారిని కేవలం ఆలయ ప్రాకారం వెలుపల జరిగే వ్రతాలు, పూజలు లేదా ఇతర ధార్మిక కార్యక్రమాలకు మాత్రమే అనుమతించాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. విదేశాలకు వెళ్లిన వారు తరచుగా సంప్రదాయాలకు విరుద్ధంగా షేవింగ్ చేసుకోవడం, జుట్టు కత్తిరించుకోవడం వంటివి చేస్తుంటారని, ఇవి గర్భాలయ అర్చకత్వానికి అనర్హతలుగా పరిగణించబడతాయని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టులో వాదించారు.

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి చెందిన డి.ఎస్.ఎస్.ఎస్. సుబ్రహ్మణ్యం సోమయాజి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేయగా, నిబంధనలను ఉల్లంఘించి అర్చకులను గర్భాలయాల్లోకి అనుమతిస్తున్న తీరును కోర్టు తప్పుపట్టింది. దేవాదాయ శాఖ తరపు న్యాయవాది కూడా ఇకపై ఈ సర్క్యులర్లను, శారదా పీఠం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తామని కోర్టుకు హామీ ఇచ్చారు. ఈ తీర్పుతో రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లో అర్చకుల నియామకాలు, వారి విధుల నిర్వహణలో మార్పులు వచ్చే అవకాశం ఉంది.

# ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

ధర్మసాగర్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రం లోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ సమీపంలో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహంవద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పుట్ట ప్రశాంత్ మాదిగ ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గంగారపు శ్రీనివాస్ మాదిగ,ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి,గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలీయా పాల్గొన్నారు. ముందుగా జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈసందర్భంగా గంగారపు శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమర యోధుడు,సంఘ సంస్కర్త, భారతదేశ మాజీ ఉపప్రధానిగా గొప్పసేవలు అందించారని తెలిపారు. ఆయన భారతీయ కుల వ్యవస్థలో వెనుకబడిన సామాజిక వర్గమైన చమరు సమాజంలో జన్మించి,తన ప్రతిభతో జాతీయ రాజకీయాల్లో అత్యున్నత స్థాయికి ఎదిగారని అన్నారు. 1935లో అంటరానితనానికి వ్యతిరేకంగా “ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్” సంస్థ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారని తెలిపారు. అదే సంవత్సరంలో బీహార్ శాసనసభకు ఎన్నికై ప్రజా సేవలో ప్రవేశించారు. 1946లో జవహర్ లాల్ నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో అతి పిన్న వయస్కుడైన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. భారత తొలి కేబినెట్‌లో కార్మిక మంత్రిగా పనిచేసి, రాజ్యాంగంలో సామాజిక న్యాయం పొందుపరచడంలో కృషి చేశారు. భారత జాతీయ కాంగ్రెస్‌లో 40 సంవత్సరాలకు పైగా వివిధ శాఖల కేబినెట్ మంత్రిగా పనిచేశారు.1971 యుద్ధసమయంలో రక్షణ మంత్రిగా బాధ్యతలు నిర్వహించి బంగ్లాదేశ్ ఏర్పాటుకు కీలక పాత్ర పోషించారు.కేంద్ర వ్యవసాయ మంత్రిగా ఉన్న సమయంలో హరిత విప్లవానికి సహకరించి,1974 కరువు సమయంలో ఆహార సంక్షోభాన్ని నివారించేందుకు ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. అత్యవసర స్థితి సమయంలో ఇందిరా గాంధీ కు మద్దతు ఇచ్చినప్పటికీ,1977లో కాంగ్రెస్ పార్టీని విడిచి జనతా పార్టీ కూటమిలో చేరి భారత ఉప ప్రధానిగా పనిచేశారు. అనంతరం కాంగ్రెస్(జె) పార్టీని స్థాపించారు.ఈ కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి బీజేపీ జిల్లా నాయకులు,పుట్ట ప్రదీప్ కాంగ్రెస్ పార్టీ



మండల నాయకులు,గంగారపు శ్యామ్ వార్డ్ మెంబర్,పుట్ట ప్రణయభాస్కర్,పుట్ట జ్ఞానరాజ్,పుట్ట చైతన్య, పల్లెపెల్లి అనిల్,చింత తిలక్, మేకల రాజు,కొట్టె ప్రణయభాస్కర్, కొట్టె అనుచరణ్, కొట్టె దేవరాజు, కొట్టె రవి,పొలుమారి రాజు, మాచెర్ల పౌలు తదితరులు పాల్గొన్నారు.

# తరాలు మారిన మా బతుకులు మారవా





అక్కన్నపేట, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండఒ అంతక పేట గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నగుబ్బడి గ్రామప్రజలు ఇక్కట్లు తరాలు మారిన పట్టించుకోని నాదుడే కరువయ్యారు అంటూ ప్రజల గోడు అంతకపేట గ్రామానికి దాదాపు నాలుగు నుండి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నగుబ్బడి,రెండు వందలయాభై నుండి మూడు వందల జనాభా ఉన్న ఈ ప్రాంతం నడక దారి, దారుణంగా ఉన్న రోడ్ చీకటి సమయంలో ప్రయాణించే పరిస్థితి,ఇప్పటికీ మారని వాళ్ళ దుస్థితి ప్రజా ప్రభుత్వంలో నైనా వారి పరిస్థితి మారతుందనుకుంటే రోజు రోజుకి ఇబ్బందిగానే మారుతుంది. రేషన్ బియ్యం వాళ్ళకి గుబ్బడిలోనే ఇవ్వాలన్న ప్రతిపాదన సర్పంచ్ ఎన్నికల ముందే వచ్చింది కానీ ఇప్పటికీ హామీకీ నోచుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఒకేసారి మూడు నెలల రేషన్ ఇవ్వడం మంచిదే కానీ మోయలేని బరువుతో వాళ్లు నాలుగు ఐదు కిలో మీటర్లు ఎలా వెళ్తారు అందులో ఆరోగ్యం బాలేని వారు, వృద్ధులు,ఆడవారు ఉంటారు ఇదీ చాలా కష్టమైన పరిస్థితి గుబ్బడి రోడ్ బాలేదు రోడ్ ప్రారంభమై దాదాపుగా సంవత్సరం గడుస్తున్నా ఇంకా పూర్తి కాలేదు, రోడ్ నిర్మాణం కొనసాగుతూనే ఉంది చీకటి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా పలువురు గ్రామస్తులు ప్రమాదాలకూ గురైఅయి గాయాలపాలయ్యారు ఉన్నాయి దారిలేక గుబ్బడికి అత్యవసర(108)అంబులెన్స్ సర్వీసు కూడా రాలేని దుస్థితి స్కూల్ పిల్లల వ్యాన్ కూడా రాదు తాగడానికి స్వచ్ఛమైన మినరల్ వాటర్ లేవు, మినరల్ వాటర్ కోసం “అంతకపేట”కు రావాల్సిన దుస్థితి ఇన్ని ఇబ్బందుల మధ్య బతుకుతున్న గుబ్బడి ప్రజలు “బాల”వికాస్ ద్వారా ఒక మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, అలాగే మినీ పాల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనీ కోరుతున్నారు “మమ్ముల్ని” కేవలం ఓటర్లుగా కాకుండా, “మనుషులుగా” గుర్తించమని వేడుకుంటున్నారు దీనికి అందరి మద్దతు కావాలి, ఈ న్యాయమైన పోరాటానికి అంతకపేట గ్రామ ప్రజలు సహకరించాలని కోరుతున్నారు. స్థానిక మంత్రి ఆర్డిఒ ఎంఆర్ఒ స్పందించి గుబ్బడి గ్రామ ప్రజల బాధను అర్థం చేసుకొని ఈ సమస్యలపై ద్రుష్టి సారించాలని వేడుకుంటున్నాను అంటూ సామాజిక కార్యకర్త కామాద్రి మురళి ఆవేదన వ్యక్తం చేశారు.



## ఎన్టీఆర్ భవన్ లో ఘనంగా మాజీ ఉప రాష్ట్రపతి బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

కూకట్ పల్లి , 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక సంస్కర్త మాజీ ఉప



ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ మాజీ ఉపాధ్యక్షులు సామా భూపాల్ రెడ్డి ముఖ్య అతిధిగా, SC సెల్ మాజీ అధ్యక్షుడు పోలంపల్లి అశోక్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీరా రాజునాయక్, BC సెల్ మాజీ అధ్యక్షుడు శ్రీపతి సతీష్ మరియు ఇతర తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనట్టు మాజీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి మరియు పెద్దపల్లి పార్లమెంట్ పరిశీలకులు కూకట్పల్లి నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు వేజెండ్ల కిషోర్ బాబు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట సభల్లో బాబు జగ్జీవన్ రామ్ తన ప్రతిభ చూపుతూ ఆయన ఆఖరు క్షణం వరకూ దళిత జాతి సముద్ధరణ కోసమే తపించారు అన్నారు.బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళి అర్పిస్తూ ఆయన స్ఫూర్తిని భావితరాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

## బాబు జగ్జీవన్ రావు జయంతి సందర్భంగా పూలమాలవేసి నివాళులర్పించిన టీఎస్ టిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు భానోత్ వీరు

ఖమ్మం, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): బాబు జగ్జీవన్ రావ్ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్ నందు గల విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు . ఈ సందర్భంగా టీఎస్ టిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు భానోత్ వీరు మాట్లాడుతూ ఆర్థికంగా , సామాజికంగా



సమానత్వం కోసం పోరాటం చేసిన మహనీయులు బాబు జగ్జీవన్ రావు ని కొనియాడారు . ఈ కార్యక్రమంలో టీఎస్ టిటిఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మంగ్యా నాయక్ , జిల్లా ప్రధాన కార్యదర్శి పాపాలాల్ , జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారాం , కిషన్ రాథోడ్ రాష్ట్ర కార్యదర్శి , మండల నాయకులు హనుమా , రమేష్ , రాంజీ , రామారావు , సుమన్ , ప్రేమ్ కుమార్ , వీరన్న , ఉపాధ్యాయులు శ్రీను , మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## పవన్ నేచర్ క్యూర్ తరపున, ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ లో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ఖమ్మం, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఖమ్మం నగరంలో స్థానిక పేలింగ్ గ్రౌండ్ నందు, ఆదివారం ఉదయం పవన్ నేచర్ క్యూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన, ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా పూర్తయ్యింది. ఈ కార్యక్రమానికి ప్రాంతంలోని



అనేక మంది ప్రజలు హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరానికి వచ్చిన వారికి అక్కడికక్కడే చికిత్స అందించడంతో పాటు ఆరోగ్యంపై అవసరమైన సలహాలు కూడా ఇవ్వడం జరిగింది. పలువురు రోగులకు తక్షణ ఉపశమనం లభించడం విశేషం. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో రాకం శ్యామ్ బాబు, ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, కార్యక్రమం మొత్తం పర్యవేక్షించారు. వారి సహకారంతో, ఈ ఉచిత వైద్య శిబిరం సజావుగా సాగి ప్రజలకు ఎంతోఉపయోగపడింది. ఆక్యుపంక్చర్ పై అవగాహన కార్యక్రమం. పవన్ నేచర్ క్యూర్ ఆశ్వర్యంలో వివిధ అనారోగ్యములపై ప్రాక్టికల్ గా అవగాహన కార్యక్రమాన్ని పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్నారు. స్థానిక ప్రజలు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యుత్ ఘాతంతో అన్నదాత మృతి

మోత్కూర్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున ఒక విషాదకర సంఘటన చోటుచేసుకుంది. సాగునీరు అందించే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై దొండ కొమురయ్య అనే రైతు ప్రాణాలు కోల్పోయారు.



పాటిమట్ల గ్రామానికి చెందిన కొమురయ్య పొలాన్ని సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ప్రస్తుతం పంటకు నీరు అవసరం ఉండటంతో, ఆదివారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. అక్కడ మోటార్ స్విచ్ ఆన్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయారు.చాలా సేపటికీ కొమురయ్య తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బావి వద్దకు వెళ్లి చూడగా, ఆయన అచేతనంగా పడి ఉండటాన్ని గమనించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. కష్టపడి సాగు చేసిన పంట చేతికి వచ్చే తరుణంలో యజమాని ఇలా ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది.

## ఈస్టర్ వేడుకలలో పాల్గొన్న దొడ్ల వెంకటేష్ గౌడ్

ఆల్విన్ కాలనీ, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఏసుక్రీస్తు మళ్ళీ ప్రాణాలతో తిరిగొచ్చిన పవిత్రమైన ఈస్టర్ రోజు శుభసందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంషిగూడ ఫుల్ గాస్పల్ చర్చిలో నిర్వహించిన ఈస్టర్ వేడుకలకు ముఖ్యఅతిధిగా డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్





హాజరై క్రైస్తవ సోదరులతో కలిసి కేక్ కట్ చేసి అందరికి ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ మన డివిజన్ లో కులమతాలకు అతీతంగా ప్రజలందరూ అన్ని పండుగలు అందరూ కలిసి చేసుకోవడం ఆనందించదగ్గ విషయం అన్నారు. క్రిస్టియన్ సోదర సోదరీమణులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, గోపాల్, లింగం, సుధాకర్, సత్తయ్య, పాస్టర్లు, చర్చ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట్ ఎస్ఎన్‌డీపీ పనుల్లో భారీ అవకతవకలు - ఎమ్మెల్యే పాత్రపై వెంటనే విజిలెన్స్ విచారణ జరపాలి: ఆకుల సతీష్

కుత్బుల్లాపూర్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల పేరుతో ప్రజా ధనం దోపిడీ జరుగుతున్నది. మొత్తం 9 పనుల్లో ఎస్ఎన్‌డీపీకి సంబంధించిన మూడు ముఖ్యమైన పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. అయినప్పటికీ, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద సన్నిహితుడైన కాంట్రాక్టర్ పి. సుధాకర్‌కు రూ. 84 కోట్ల భారీ చెల్లింపులు జరగడం





తీవ్రమైన అవినీతి ఆరోపణలకు కారణమవుతోంది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ప్రభుత్వ నిధులు సరిపోకపోయినా, నిబంధనలను పక్కనబెట్టి కార్పొరేషన్ నుంచి అదనంగా రూ. 30 కోట్లు విడుదల చేయించడం జరిగింది. పనులు పూర్తికాకుండానే ఇంత భారీగా చెల్లింపులు చేయించడం వెనుక ఎవరి ఒత్తిళ్లు ఉన్నాయో ప్రజలకు స్పష్టంగా తెలియాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవహారం మొత్తం ప్రజా ధన దుర్వినియోగానికి, అవినీతి పరిపాలనకు నిదర్శనంగా నిలుస్తోంది. ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తికాకుండానే కాంట్రాక్టర్‌కు కోట్ల రూపాయలు చెల్లింపులు చేయించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఒ కాంట్రాక్టర్ పి. సుధాకర్‌పై తక్షణమే విజిలెన్స్ విచారణ చేపట్టి నిజాలు వెలికి తీయాలి. లేకపోతే, దీనిపై పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరిస్తున్నాము. ఈ కార్యక్రమంలో ప్రసాద్, మురళి, ఈశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి




ఇనుగుర్తి, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): దళితుల అభ్యున్నతి కోసం పోరాడిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా ఇనుగుర్తి మండల కేంద్రంలో అంబేద్కర్



యువజన సంఘం ఆధ్వర్యంలో ,చిన్ననాగారం గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పప్పుల వెంకన్న, ప్రధాన కార్యదర్శి మహంకాళి సలీం, కోశాధికారి గోపందాస్ కృష్ణ, ఇనుగుర్తి సర్పంచ్ తమ్మడపల్లి కుమార్, చిన్యా తండా సర్పంచ్ జాటోత్ హరిచంద్, దిశా కమిటీ మెంబర్ గుజ్జునూరి బాబురావు, దార్ల రాంమ్మూర్తి, బేతమల్ల చంద్రయ్య, మామిడి అశోక్, వేముల శ్రీనివాస్, గాడిదల రాజలు, చిన్ననాగారంలో గ్రామ సర్పంచ్ చెడుపాక సుజాత యాకన్న, ఉపసర్పంచ్ తుమ్మనపల్లి సతీష్, వార్డు మెంబర్లు బైరు వినయ్, చెడుపాక సురేష్, ముత్యాల సోమక్క వెంకన్న, బైరు శ్రీనివాస్ గౌడ్, గుండాల ధర్మయ్య,బైరు వెంకటయ్య, చెడుపాక దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ పంపిని కార్యక్రమంలో పాల్గొన్న ప్రేమ కుమార్

కూకట్‌పల్లి, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): గాయత్రీ నగర్ డివిజన్ వివేకానంద కాలనీ లో జనసేన నాయకులు పవన్ నాయుడు, ప్రభాకర్ సౌజన్యం తో నిర్వహించిన మజ్జిగ పంపినీ కార్యక్రమానికి




ముఖ్యఅతిథిగా సైబరాబాద్ మున్సిపల్ జనసేన పార్టీ కో ఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ హాజరై మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వాకులు ప్రేమ కుమార్ ని శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు జల్లా రవి, తుంగల రామారావు , సూర్యనారాయణ, అడ్డాల వీరబాబు, ప్రసాద్, రామ్, గౌతమ్ మరియు వీర మహిళలు లక్ష్మి, వరమ్మ కాలనీ వాసులు తధితరులు పాల్గొన్నారు.

## స్క్రీన్ లైఫ్ ప్రభావం.. మెడ, భుజాల నొప్పులకు వ్యాయామాలే పరిష్కారం

హెల్త్ న్యూస్, **05** ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఇప్పటి డిజిటల్ ప్రపంచంలో మెడ, భుజాల నొప్పి ఒక సాధారణ సమస్యగా మారింది. పని కోసం గంటల తరబడి కంప్యూటర్ ముందు కూర్చోవడం, ఫోన్ వినియోగం, ట్రాఫిక్‌లో ఒత్తిడితో ప్రయాణాలు వంటి కారణాలతో లక్షలాది మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. తప్పు భంగిమ, ఎక్కువసేపు కూర్చోవడం వల్ల కండరాల ఒత్తిడి, రోజువారీ జీవిత ఒత్తిడి వంటి అంశాలు ఈ నొప్పులకు దారితీస్తున్నాయి. ఈ సమస్యలు నిద్రను దెబ్బతీయడమే కాకుండా కదలికలను తగ్గించి తలనొప్పులకు కూడా కారణమవుతాయి. అయితే కొన్ని సులభమైన వ్యాయామాలతో ఈ సమస్యలను తగ్గించుకోవచ్చు. ఈ వ్యాయామాలను కొద్ది నిమిషాల పాటు చేయడం ద్వారా గట్టిపడిన కండరాలను చాచడం, బలపరచడం, శరీర సమతుల్యతను పునరుద్ధరించడం సాధ్యమవుతుంది. ఇవి నొప్పి తగ్గించడమే కాకుండా భవిష్యత్తులో సమస్యలను నివారించడంలో కూడా సహాయపడతాయి. మెడ, భుజాల నొప్పిని తగ్గించే కొన్ని సులభమైన వ్యాయామాలు ఇలా ఉన్నాయి.



మెడ టిల్ట్స్: మెడ టిల్ట్స్ వ్యాయామం స్క్రీన్ ముందు ఎక్కువసేపు ఉండడం వల్ల గట్టిపడే మెడ పక్క కండరాలపై ప్రభావం చూపుతుంది. నిటారుగా కూర్చుని లేదా నిలబడి, భుజాలను రిలాక్స్‌గా ఉంచాలి. నెమ్మదిగా తలను ఒక వైపుకు వంచి, చెవిని అదే వైపు భుజానికి దగ్గర చేయాలి. **15** నుంచి **30** సెకన్ల పాటు ఆ స్థితిలో ఉండి సమంగా శ్వాస తీసుకోవాలి. తరువాత మరో వైపుకు కూడా ఇదే విధంగా చేయాలి. ప్రతి వైపుకు **3** సార్లు చేయడం మంచిది. ఇది రోజులో పలుమార్లు, ముఖ్యంగా ఉదయం లేవగానే లేదా నిద్రకు ముందు చేయడం వల్ల ఒత్తిడి తగ్గి రక్త ప్రసరణ మెరుగవుతుంది.

షోల్డర్ రోల్స్: ల్యాప్‌టాప్ ముందు వంగి కూర్చోవడం వల్ల పైభాగం వెన్ను, భుజాల కండరాలు గట్టిపడతాయి. షోల్డర్ రోల్స్ ఈ సమస్యను తగ్గించడంలో సహాయపడతాయి. నిలబడి లేదా సౌకర్యంగా కూర్చుని, శ్వాస తీసుకుంటూ భుజాలను చెవుల వైపు పైకెత్తి తరువాత ముందుకు గుండ్రంగా తిప్పాలి. **10-15** సెకన్ల పాటు ఇలా చేసి, తరువాత వెనుకవైపు తిప్పాలి. ప్రతి దిశలో **5-10** సార్లు చేయాలి. దీన్ని రోజుకు రెండు సార్లు చేయడం ద్వారా రక్తప్రసరణ పెరిగి భంగిమ మెరుగుపడుతుంది.

చిన్ టక్స్: ఫోన్ వినియోగం వల్ల వచ్చే ఫార్వర్డ్ హెడ్ పొజిషన్‌ను సరిచేయడంలో చిన్ టక్స్ ఉపయోగపడతాయి. నిటారుగా కూర్చుని తలను కదపకుండా గడ్డాన్ని వెనక్కి తీసుకురావాలి. **5** సెకన్ల పాటు ఆ స్థితిలో ఉంచి వదలాలి. రోజుకు **2-3** సార్లు ప్రతి సారి **10** రిపిటేషన్లు చేయాలి. ఇది మెడ కండరాలను బలపరచి నొప్పిని తగ్గిస్తుంది.

అక్రాస్ ది చెస్ట్ స్ట్రెచ్: భుజాలు వంగిపోవడం వల్ల గట్టిపడే కండరాలను సడలించడంలో ఈ వ్యాయామం సహాయపడుతుంది. ఒక చేతిని భుజాల ఎత్తులో సూటిగా ముందుకు చాపి, మరో చేతితో దాన్ని ఛాతీ వైపు నెమ్మదిగా లాగాలి. **20-30** సెకన్ల పాటు ఉంచి, ప్రతి వైపుకు **3-5** సార్లు చేయాలి. ఇది భుజాల కండరాలను రిలాక్స్ చేస్తుంది.


ఈర్ టు షోల్డర్ స్ట్రెచ్: ఈ వ్యాయామం మెడ కండరాలను సడలిస్తుంది. తలను నెమ్మదిగా ఒక వైపు వంచి, అవసరమైతే చేతితో స్వల్ప ఒత్తిడి ఇవ్వాలి. **20-40** సెకన్ల పాటు ఉంచి, ప్రతి వైపుకు **3** సార్లు చేయాలి. ఇది ఒత్తిడి వల్ల వచ్చే తలనొప్పులను తగ్గించడంలో సహాయపడుతుంది.

సీటెడ్ ట్విస్ట్: ఈ వ్యాయామం వెన్నెముకను సడలించి మెడ, భుజాలపై ఒత్తిడిని తగ్గిస్తుంది. కుర్చీలో కూర్చుని, ఒక చేతిని ఎదురుగా ఉన్న మోకాలిపై ఉంచి, మరో చేతిని వెనుక ఉంచి శరీరాన్ని మెల్లగా తిప్పాలి. ప్రతి వైపుకు **20-30** సెకన్ల పాటు **3** సార్లు చేయాలి. ఇది ఎక్కువసేపు కూర్చునే వారికి ఎంతో ఉపయోగకరం.

చైల్డ్ పోజ్: ఈ యోగా భంగిమ మొత్తం శరీరాన్ని రిలాక్స్ చేస్తుంది. మోకాళ్లపై కూర్చుని, ముందుకు వంగి చేతులను ముందుకు చాపి నుదుటిని నేలపై ఉంచాలి. **30-60** సెకన్ల పాటు లోతుగా శ్వాస తీసుకోవాలి. రోజుకు **3-5** సార్లు చేయడం ద్వారా శరీర ఒత్తిడి తగ్గుతుంది.

ఈ సరళమైన వ్యాయామాలను క్రమం తప్పకుండా చేయడం ద్వారా మెడ, భుజాల నొప్పులను సమర్థవంతంగా నియంత్రించవచ్చు. సరిగ్గా చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం సాధ్యమవుతుంది.

## రోజూ గాఢంగా నిద్ర పోతున్నారా, లేదా.. అలా చేయకపోతే ఇబ్బందులు తప్పవు



హెల్త్ న్యూస్, **05** ఏప్రిల్ (క్రాంతి న్యూస్): లోతైన నిద్ర (డీప్ స్లీప్) రావడంలో ఇబ్బంది పడుతున్నట్లయితే, దాని వెనుక శారీరక ఆరోగ్య పరిస్థితి కారణంగా ఉండవచ్చని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. **Frontiers of Psychiatry**లో ప్రచురితమైన నిద్రపై పరిశోధన ప్రకారం శారీరక ఆరోగ్యం, నిద్ర మధ్య ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. దేశంలో చాలా మంది ఇప్పటికే తమ జీవనశైలివల్ల సరిపడా నిద్ర పొందడంలో ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా శారీరక చురుకుదనం లోపం నిద్ర లోతు, నిద్ర చక్రం, తదుపరి రోజు మానసిక స్థితిపై ప్రభావం చూపుతోంది. వయస్సును బట్టి అవసరమైన నిద్ర గంటలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ వాస్తవ పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. డిజిటల్ పరికరాలపై అధికంగా ఆధారపడటం, కాలుష్యం పెరగడం, వాతావరణ ఉష్ణోగ్రతలు అధికమవడం, పోషకాహారం లోపం వంటి అంశాలు కలిసి నిద్ర సమస్యలను మరింత పెంచుతున్నాయి. దీంతో లోతైన నిద్ర లేకపోవడం వల్ల మానసిక విశ్రాంతి సరిగా లేకపోవడం, డిజిటల్, శారీరక అలసట నిద్ర సమయాన్ని దెబ్బతీస్తున్నాయి.

రోగ నిరోధక శక్తి, మానసిక ఆరోగ్యం..

లోతైన నిద్ర అనేది మానసిక పునరుద్ధరణ, రోగనిరోధక శక్తి, మానసిక ఆరోగ్యానికి పునాది వంటిది. ఈ అంశాలు పరస్పర సంబంధం కలిగి ఉండటంతో ప్రతిరోజూ మంచి నిద్రపై దృష్టి పెట్టడం చాలా అవసరం. **Oxford Research Encyclopedia of Psychology**లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం లోతైన నిద్ర కోసం రోజువారీ సరిపడా శారీరక చురుకుదనం అవసరం. శారీరక ఆరోగ్యం బాగుంటే నిద్ర నాణ్యత కూడా మెరుగ్గా ఉంటుంది. అదే విధంగా నిద్ర బాగుంటే ఆరోగ్యం కూడా మెరుగవుతుంది. లోతైన, శరీరాన్ని పునరుద్ధరించే నిద్ర మంచి ఆరోగ్యానికి కీలకం. ఇది కణజాలాలను మరమ్మత్తు చేయడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో, హార్మోన్ల సమతుల్యతను కాపాడడంలో, మెదడు పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అయితే ప్రస్తుతం చాలా మంది తక్కువ నాణ్యత గల నిద్రతో ఇబ్బంది పడుతున్నారు. నిద్ర నాణ్యతను మెరుగుపరచడానికి అత్యంత సహజమైన మార్గం శారీరక వ్యాయామం అని వైద్యులు తెలియజేస్తున్నారు.

వయస్సును బట్టి రోజువారీ శారీరక చురుకుదనం..

తగినంత లోతైన నిద్ర లేకపోతే జ్ఞాపకశక్తి, దృష్టి కేంద్రీకరణ, భావోద్వేగ నియంత్రణ, ఇతరులతో వ్యవహరించే తీరు వంటి అంశాలు దెబ్బతింటాయి. దీర్ఘకాలంగా నిద్ర లోపం ఉంటే, మానసిక లోపాలు, ఎక్కువ తప్పిదాలు, శారీరక కదలికల సామర్థ్యం తగ్గడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం వయస్సును బట్టి రోజువారీ శారీరక చురుకుదనం అవసరం. **5-18** సంవత్సరాల పిల్లలు రోజుకు కనీసం **60** నిమిషాల మోస్తరు నుంచి తీవ్ర వ్యాయామం చేయాలి. ఈత, సైక్లింగ్, క్రీడలు వంటి కార్యకలాపాలు చేయడం మంచిది. వారానికి కనీసం మూడు రోజులు కండరాలు, ఎముకలను బలపరిచే వ్యాయామాలు చేయాలి. అలాగే స్క్రీన్ టైమ్‌ను రోజుకు **2** గంటలకు తగ్గించుకోవాలని సూచిస్తున్నారు.

వ్యాయామం తప్పనిసరి..

**18-64** సంవత్సరాల వయస్సు గల పెద్దలు తమ పనితీరు ఆధారంగా వ్యాయామాన్ని సర్దుబాటు చేసుకోవాలి. రోజంతా కూర్చునే ఉద్యోగాలు చేసే వారు రోజుకు **30-45** నిమిషాల నడకతో పాటు అధిక తీవ్రత వ్యాయామాలు చేయాలి. మోస్తరు శారీరక శ్రమ చేసే వారు వారానికి **150** నిమిషాలు వ్యాయామం, రెండు రోజులు స్ట్రెంగ్త్ ట్రైనింగ్ చేయాలి. కూలి పనులు చేసే వారు శరీర పునరుద్ధరణపై దృష్టి పెట్టి తేలికపాటి వ్యాయామాలు చేయాలి. యోగా, కండర బలం పెంచే వ్యాయామాలు రోజువారీ అలవాటుగా ఉండాలి. **65** ఏళ్లు పైబడిన వృద్ధులు రోజువారీ పనులను సులభంగా చేయగలిగే విధంగా ఫంక్షనల్ ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలి. సమతుల్యతను పెంచే వ్యాయామాలు, తేలికపాటి బలం పెంచే వ్యాయామాలు చేయడం ద్వారా పడిపోవడాన్ని నివారించవచ్చు, ఎముకల బలం నిలుపుకోవచ్చు. నిద్రకు ముందు తీవ్రమైన వ్యాయామం చేయకూడదని నిపుణులు సూచిస్తున్నారు, ఎందుకంటే ఇది హృదయ స్పందన వేగాన్ని పెంచి నిద్రను ఆలస్యం చేయవచ్చు. రోజువారీ శారీరక చురుకుదనం కోసం నడక, యోగా, సైక్లింగ్ వంటి సులభమైన చర్యలను అలవాటు చేసుకోవాలి. ఆఫీసులో చిన్న స్ట్రెచింగ్ వ్యాయామాలు, మధ్య మధ్యలో నడక చేయడం ద్వారా కండరాల కదలికలను కొనసాగించాలి. మంచి నిద్ర కోసం స్క్రీన్‌లకు దూరంగా ఉండటం, చల్లని గదిలో నిద్రపోవడం వంటి మంచి అలవాట్లు కూడా పాటించాలి.

శారీరక చురుకుదనం లేకపోతే నిద్ర సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువ. లోతైన నిద్ర లేకపోవడం ఊబకాయం, ఒత్తిడి, నిద్రలేమి వంటి సమస్యలకు దారితీస్తుంది. ఇవి శారీరక ఆరోగ్యాన్ని మాత్రమే కాదు, మానసిక ఆరోగ్యాన్నీ ప్రభావితం చేస్తాయి. మంచి లోతైన నిద్ర కోసం నిరంతర శారీరక చురుకుదనం అత్యంత అవసరం. చిన్న చిన్న మార్పులతో ప్రారంభించి, క్రమంగా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకుంటే ప్రతి రాత్రి సులభంగా లోతైన నిద్ర పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## బీసీసీఐకి లేఖ రాసిన బంగ్లా క్రికెట్ బోర్డు.. ఎందుకో తెలుసా?




స్పోర్ట్స్ న్యూస్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఇటీవల భారత్, బంగ్లాదేశ్ మధ్య క్రికెట్ సంబంధాలు క్షీణించాయి. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో ఆ దేశ బౌలర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను ఐపీఎల్ నుంచి బీసీసీఐ తప్పించడం చర్చనీయాంశమైంది. బంగ్లాదేశ్ కూడా భారత్‌లో ఇటీవల జరిగిన టీ20 వరల్డ్ కప్ నుంచి తప్పుకోవడంతో వివాదం ముదిరింది. అయితే, బీసీసీఐతో సత్సంబంధాలను పునరుద్ధరించుకోవాలని బంగ్లా క్రికెట్ బోర్డు(బీసీబీ) చూస్తోంది. సెప్టెంబర్‌లో టీమ్ ఇండియా పర్యటనను కాపాడుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా బీసీసీఐకి బీసీబీ లేఖ రాసినట్టు బోర్డు వర్గాలు తెలిపాయి. 'అవును. బంగ్లా క్రికెట్ బోర్డు బీసీసీఐకి లేఖ రాసింది. సెప్టెంబర్‌లో బంగ్లాలో భారత జట్టు పర్యటన గురించే కాకుండా వచ్చే ఏడాది బీసీబీ ఆతిథ్యమిస్తున్న ఆసియా కప్ గురించి లేఖలో ప్రస్తావించింది.'అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. టీమిండియా మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వడం ద్వారా వచ్చే ఆదాయం, డిజిటల్ బ్రాడ్ కాస్ట్ రైట్స్ అమ్మకం ద్వారా వచ్చే ఆదాయం ద్వారా బోర్డు ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుకోవాలని బీసీబీ భావిస్తున్నది.

## ముంబై ఇండియన్స్‌కు భారీ ఊరట: కోలుకున్న హార్దిక్ పాండ్యా



స్పోర్ట్స్ న్యూస్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుస ఒడుదొడుకులను ఎదుర్కొంటున్న ముంబై ఇండియన్స్ జట్టుకు శుభవార్త అందింది. అనారోగ్యం కారణంగా ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన గత మ్యాచ్‌కు దూరమైన కెప్టెన్ హార్దిక్ పాండ్యా ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నట్లు సమాచారం. మంగళవారం రాజస్థాన్ రాయల్స్‌తో జరగనున్న కీలక పోరులో ఆయన బరిలోకి దిగడం దాదాపు ఖాయమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుత సీజన్‌లో ముంబై ప్రదర్శన మిశ్రమంగా ఉంది. కోల్‌కతా నైట్ రైడర్స్ పై అద్భుత విజయాన్ని అందుకున్న జోరును ముంబై కొనసాగించలేకపోయింది.

నిన్న ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ గైర్హాజరీ జట్టుపై స్పష్టంగా కనిపించింది. ఆ మ్యాచ్‌లో ముంబై ఓటమిని చవిచూసింది. ఇప్పుడు జట్టు పగ్గాలను హార్దిక్ తిరిగి చేపట్టనుండటంతో, రాజస్థాన్‌పై విజయం సాధించి మళ్లీ ఫామ్‌లోకి రావాలని ముంబై భావిస్తోంది. హార్దిక్ రాకతో అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో జట్టు సమతూకం పెరుగుతుందని మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. ముఖ్యంగా పాయింట్ల పట్టికలో అగ్రస్థానాల్లో ఉన్న రాజస్థాన్ రాయల్స్‌ను ఎదుర్కోవాలంటే హార్దిక్ వంటి ఆల్‌రౌండర్ సేవలు ముంబైకి అత్యవసరం.

## పాయల్‌కు పసిడి.. పారా ఆర్చరీ ప్రపంచ టోర్నీ



స్పోర్ట్స్ న్యూస్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): పారా ఆర్చరీ ప్రపంచ సిరీస్‌లో భారత ఆర్చర్ల పతక జోరు కొనసాగుతున్నది. శనివారం జరిగిన మహిళల కాంపౌండ్ ఫైనల్లో యువ సంచలనం పాయల్ నాగ్ 139-136 తేడాతో భారత్‌కే చెందిన స్టార్ ఆర్చర్ శీతల్‌దేవిపై అద్భుత విజయం సాధించింది. ఆద్యం హోరాహోరీగా సాగిన పోరులో పాయల్..శీతల్‌కు దీటైన పోటీనిస్తూ పసిడి పతకాన్ని ముద్దాడింది. తన కెరీర్‌లో రెండో అంతర్జాతీయ టోర్నీ ఆడుతున్న పాయల్ ఒత్తిడిని చిత్తుచేస్తూ అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది. చివరిదాకా ఇద్దరి మధ్య హోరాహోరీ పోరు జరిగింది.

మరోవైపు పురుషుల కాంపౌండ్ ఫైనల్లో తోమన్‌కుమార్ 146-142తో జొనాథన్ మిల్నెపై గెలిచి స్వర్ణం దక్కించుకోగా, రికర్వ్‌లో భావ్న పసిడి సొంతం చేసుకుంది. పురుషుల రికర్వ్ ఫైనల్లో హర్విందర్‌సింగ్ రజతానికి పరిమితమయ్యాడు. ఓవరాల్‌గా టోర్నీని భారత్ ఏడు స్వర్ణాలు సహా ఐదు రజతాలు, నాలుగు కాంస్యాలతో అగ్రస్థానంలో నిలిచింది.

## ఏసియన్ బాక్సింగ్‌లో వరల్డ్ చాంపియన్‌కు విశ్వనాథ్ షాక్.. పతకం ఖాయం



స్పోర్ట్స్ న్యూస్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): మంగోలియాలో జరుగుతున్న ఏసియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ విశ్వనాథ్ సురేశ్ అదరగొట్టాడు. శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో ఏకంగా వరల్డ్ చాంపియన్‌కే షాకిచ్చాడు. 50 కేజీల కేటగిరీలో పాల్గొన్న విశ్వనాథ్ ఆ కేటగిరీలో వరల్డ్ నం.1 అయిన కజకస్థాన్‌కు చెందిన సంజార్ తాష్కెన్‌బేను మట్టికరిపించాడు. 5-0తో ఏకపక్ష విజయం సాధించాడు. దీంతో సెమీస్‌లో అడుగుపెట్టడమే కాకుండా పతకాన్ని కూడా ఖాయం చేసుకున్నాడు. మరో భారత బాక్సర్ నరేందర్ కూడా సెమీస్‌కు పతకం ఖాయం చేసుకున్నాడు. పురుషుల 90+ కేజీల కేటగిరీలో నరేందర్ క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో 5-0 తేడాతో యూఏఈ బాక్సర్ ఓర్ఖాన్ అఘాయేవ్‌పై గెలుపొందాడు. ఇక అంకుషిత మహిళల 65 కేజీల కేటగిరీలో సెమీస్‌లో అడుగుపెట్టింది. క్వార్టర్స్‌లో కజకస్థాన్‌కు చెందిన యెస్సెంకెల్డిని 4-1తో చిత్తు చేసి పతకం ఖరారు చేసుకుంది. శుక్రవారం నిఖత్ జరీన్, ప్రియా ఘంఘాస్, ప్రీతి పవార్ కూడా సెమీస్‌కు చేరుకున్న విషయం తెలిసిందే.

## రవి బిష్ణోయ్ సంచలన ప్రదర్శన

### కష్టకాలం నుంచి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు వరకు!



స్పోర్ట్స్ న్యూస్, 05 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఐపీఎల్ 2026లో యువ లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ అద్భుత ప్రదర్శనతో రాజస్థాన్ రాయల్స్ జట్టు ఊహించని విజయం అందుకుంది. శనివారం ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో గుజరాత్‌పై రాయల్స్ 6 పరుగుల తేడాతో నెగ్గింది. బిష్ణోయ్ తన మాయాజాలంతో (4/41) మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. సాయి సుదర్శన్, గ్లెన్ ఫిలిప్స్, వాషింగ్టన్ సుందర్, రాహుల్ తేవాతియా లాంటి డేంజరస్ బ్యాటర్లను పెవిలియన్ చేర్చాడు. రాజస్థాన్ విజయంలో కీలక పాత్ర పోషించిన బిష్ణోయ్.. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును సొంతం చేసుకున్నాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడిన బిష్ణోయ్.. తన ప్రయాణం, కష్టాలు, ఈ విజయానికి వెనుక ఉన్న శ్రమ గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించాడు.

'గత సీజన్ నాకు చాలా కష్టంగా గడిచింది. ఆ సమయంలో కూడా నా ప్రాసెస్‌ను వదల్లేదు. ముఖ్యంగా నా బౌలింగ్ లెంగ్త్‌పై ఎక్కువగా దృష్టి పెట్టాను. నా లెంగ్త్ తప్పితేనే బ్యాటర్లు సిక్సులు కొడతారు. అది నా బలహీనత అని తెలుసుకున్నా. అందుకే ఈసారి లెంగ్త్‌ను కచ్చితంగా పడేలా ప్రాక్టీస్ చేశాను. ఈ క్రమంలో మానసికంగా, సాంకేతికంగా, శారీరకంగా ఎంతో శ్రమించా. గత సీజన్ మొత్తం, భారత్ తరఫున కూడా ఆడుతూ నా లెంగ్త్‌పై ప్రత్యేకంగా పని చేశా. నా లెంగ్త్‌లో బంతులు వేసినా బ్యాటర్లు సిక్సులు కొడితే నాకు అభ్యంతరం లేదు. ఈరోజు నేను ఫుల్ లెంగ్త్ వేసినప్పుడు బౌండరీలు వచ్చాయి. కానీ గుడ్ లెంగ్త్ బంతులకు రన్స్ రాలేదు. మంచి లెంగ్త్‌లో బౌలింగ్ చేస్తే విజయవంతమవుతానని నమ్మకం కలిగింది. క్రమశిక్షణతో బౌలింగ్ చేయడం వల్లే ఈ ఫలితం వచ్చింది. ఇకపై ప్రతి మ్యాచ్ బాగా ఆడాలనుకుంటున్నా' అని రవి బిష్ణోయ్ చెప్పాడు.

ఈ మ్యాచ్‌లో తనకు అత్యంత ఇష్టమైన వికెట్ గురించి అడగగా.. రాహుల్ తేవాతియా వికెట్ ప్రత్యేకమని చెప్పాడు. 'రాహుల్ మంచి ఫినిషర్. అతను క్రీజులో ఉంటే మ్యాచ్ ఎటు తిరుగుతుందో చెప్పలేం. అతడిని ఔట్ చేయడం చాలా కీలకం. నాకు చాలా ఆనందంగా అనిపించింది' అని రవి బిష్ణోయ్ పేర్కొన్నాడు. వ్యక్తిగత ప్రదర్శన కంటే జట్టు విజయం తనకు ముఖ్యమని బిష్ణోయ్ స్పష్టం చేశాడు. 'చివరి ఓవర్లలో తుషార్ దేశ్‌పాండే, ఆర్చర్ అద్భుతంగా బౌలింగ్ చేయడం వల్లే ఈ విజయం సాధ్యమైంది. ఇది పూర్తిగా టీమ్ ఎఫర్ట్. మేము యువ జట్టు. ఇలాగే ప్రేక్షకులను అలరించాలనుకుంటున్నాం' అని బిష్ణోయ్ చెప్పుకొచ్చాడు.

క్రాంతి
సోమవారం 06 ఏప్రిల్ 2026
epaper.krtvnews.com

# సినిమా న్యూస్



## అదృష్టం అంటే ఈమెదే

మోస్ట్ క్యూటెస్ట్ బ్యూటీ సారా అర్జున్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈ ముద్దుగుమ్మ తమిళ నటుడు విక్రమ్ హీరోగా రూపొందిన 'థైవ తిరుమల్'లో చైల్డ్ ఆర్టిస్టుగా నటించి మంచి గుర్తింపును సంపాదించుకుంది. కొంతకాలం క్రితం ఈమె తెలుగులో రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో రూపొందిన 'దాగుడుమూతల దండాకోర్'లో నటించి ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం ఈమె సినిమాల్లో హీరోయిన్ మరియు కీలక పాత్రల్లో నటిస్తూ మంచి జోష్‌లో కెరీర్‌ను ముందుకు సాగిస్తుంది. రీసెంట్ టైంలో ఈమెకు వరుసగా భారీ పాన్ ఇండియా చిత్రాల్లో అవకాశాలు దక్కుతున్నాయి.

కొంతకాలం క్రితం మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన పొన్నియిన్ సెల్వన్ అనే భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రంలో నటించి ప్రేక్షకులను అలరించింది. రణవీర్ సింగ్ హీరోగా ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ధురంధర్, ధురంధర్: ది రివెంజ్ చిత్రాల్లో ఈమె హీరోయిన్‌గా నటించింది. ఈ రెండు సినిమాలు మంచి విజయాలను అందుకోవడంతో ఈమెకు ఇండియా వ్యాప్తంగా గుర్తింపు లభించింది. ఇక దీంతో వరుసగా ఈ బ్యూటీకి పాన్ ఇండియా చిత్రాల్లో, సూపర్ క్రేజ్ ఉన్న సినిమాలో అవకాశాలు దక్కుతున్నట్లు తెలుస్తోంది.


## ఐటమ్ సాంగ్‌లో జిగేల్ రాణి



టాలీవుడ్ యువ నటుడు విజయ్ దేవరకొండ ప్రస్తుతం రవికిరణ్ కోలా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రౌడీ జనార్ధన' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాలో కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటించనున్నారు. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు మరియు శిరీష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కొంతకాలం క్రితం ఈ సినిమా నుండి విడుదలైన గ్లింప్స్ వీడియో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం చిత్ర షూటింగ్ శర వేగంగా సాగుతోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ క్రేజీ వార్త వైరల్ అవుతుంది.

ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం 'రౌడీ జనార్ధన'లో ఒక ఐటమ్ సాంగ్ ఉండనుందని, ఈ పాటను పూజా హెగ్డే తో ప్లాన్ చేస్తున్నట్లు, ఆమెతో మేకర్స్ ఇప్పటికే సంప్రదించినట్లు, పూజా కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. పూజా హెగ్డే 'రంగస్థలం'లోని జిగేలు రాణి ఐటమ్ సాంగ్ ద్వారా భారీ క్రేజ్ సంపాదించగా, ఆ తర్వాత ఎఫ్2 మరియు కూలీ చిత్రాల్లో కూడా స్పెషల్ సాంగ్స్ ప్రేక్షకులకు అలరించింది. ఈ నేపథ్యంలో 'రౌడీ జనార్ధన'లో పూజ్జా హెగ్డే ఐటమ్ సాంగ్ చేయనున్నట్లు వార్తలు రావడంతో దీనిపై అంచనాలు భారీగా పెరిగాయి.

## రష్మిక బర్త్‌డే సందర్భంగా 'మైసా' కొత్త పోస్టర్ విడుదల




మోస్ట్ టాలెంటెడ్ నటి రష్మిక మందన్న ప్రస్తుతం పలు చిత్రాల్లో నటిస్తూ బిజీగా కొనసాగుతోంది. అయితే ఆమె నటిస్తున్న సినిమాల్లో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పరచుకున్న చిత్రం 'మైసా'. ఈ లేడీ ఓరియెంటెడ్ చిత్రంలో రష్మిక ప్రధాన పాత్రలో కనిపించబోతుంది. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి పెద్దగా ప్రచార చిత్రాలను విడుదల చేయలేదు. అయినప్పటికీ ఇప్పటికే విడుదలైన పోస్టర్ల ద్వారానే ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా రష్మిక పాత్రకు సంబంధించిన లుక్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఇక ఈరోజు రష్మిక పుట్టినరోజు సందర్భంగా మూవీ యూనిట్ మరో కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్ పూర్తిగా బ్లాక్ అండ్ వైట్‌లో ఉండటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పోస్టర్‌లో రష్మిక ముఖం నిండా మట్టి, అలాగే రక్తపు మరకలతో కనిపిస్తూ రా అండ్ రస్టిక్ లుక్‌లో దర్శనమిచ్చింది.

ఆమె లుక్ ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండటంతో ఈ పోస్టర్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. దాంతో ఈ సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన యోధురాలిగా, అత్యంత పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. ఈ చిత్రానికి రవీంద్ర పూలే దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని అజయ్ సయ్యపురెడ్డి, అనిల్ సయ్యపురెడ్డి, వీరసాయి గోప సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతాన్ని అందిస్తున్నారు. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం 2026లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం విడుదలైన పోస్టర్‌కు మంచి స్పందన లభిస్తుండటంతో 'మైసా' సినిమా విడుదలపై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకు పెరుగుతోంది.

## 'కనకదుర్గ'గా రాబోతున్న అల్లరి నరేష్

టాలీవుడ్ ఇండస్ట్రీలో అద్భుతమైన గుర్తింపును సంపాదించుకున్న నటులలో అల్లరి నరేష్ ఒకరు. కెరీర్ ప్రారంభంలో కామెడీ చిత్రాలతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న ఈయన, ఈ మధ్యకాలంలో మాత్రం వైవిధ్యమైన కథాంశాలతో కూడిన సినిమాల్లో ఎక్కువగా నటిస్తున్నాడు. నాంది సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న తర్వాత, అదే స్థాయి విజయాలను సాధించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, ఆ తర్వాత వచ్చిన వైవిధ్యమైన సినిమాలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోయాయి. ఇటీవల ఈ నటుడు 12A రైల్వే కాలనీ చిత్రంతో ప్రేక్షకులను పలకరించాడు. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేదు. ప్రస్తుతం అల్లరి నరేష్ పలు ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాడు.



ఇప్పటికే 'ఆల్కహాల్' అనే సినిమాలో నటిస్తున్న నరేష్, తాజాగా మరో కొత్త సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. దర్శకుడు ప్రదీప్ మద్దాలి దర్శకత్వంలో, రచయిత--నిర్మాత బి.వి.ఎస్ రవి నిర్మాణంలో ఈ కొత్త చిత్రం రూపొందబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా డివోషనల్ టచ్‌తో రూపొందబోతుందని సమాచారం. ఈ నేపథ్యంలో చిత్రానికి 'కనకదుర్గ' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేసినట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరికొన్ని రోజుల్లోనే ఈ సినిమా లాంచింగ్ కార్యక్రమం జరగనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ మూవీ లాంచింగ్ కార్యక్రమానికి సురేఖ కొణిదెల, స్వప్న దత్, విద్య కొప్పినీడి, జాహ్నవి నారంగ్, సుప్రియ యార్లగడ్డ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేయనున్నట్లు సమాచారం.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com